




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 25.04.2026 | సంపుటి : 12 సంచిక : 276 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్










జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25 ఏప్రిల్ 2026

# ట్రాఫిక్ చక్రబంధంలో హైదరాబాద్

హైదరాబాద్, సికింద్రాబాద్ ఈ జంట నగరాలు కేవలం భౌగోళిక ప్రాంతాలు మాత్రమే కాదు, ఇవి దక్షిణ భారతదేశపు గుండెకాయలు. ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాలుగా వర్ధిల్లుతున్న ఈ మహానగరాలో నివసించే కోట్లాది మంది పౌరులకు ప్రతి రోజూ ఎదురయ్యే అతిపెద్ద శత్రువు యుద్ధం కాదు. అది ట్రాఫిక్. ఉదయం ఆఫీసులకు వెళ్ళే వేళ, సాయంత్రం అలసిపోయి ఇంటికి చేరే వేళ రోడ్లు వాహనాల సముద్రంలా మారిపోతున్నాయి. అడుగు ముందుకు పడని స్థితిలో గంటల తరబడి స్టీరింగ్ పట్టుకుని వేచి చూడడం నగరవాసుల దైనందిన జీవితంలో ఒక శాపంగా మారింది. ఈ సమస్యను శ్రద్ధగా పరిశీలించి, దాని మూలాలను తవ్వి తీసి చూస్తే నగర పాలనలోని డొల్లతనాన్ని, ప్రణాళికా లోపాలు కనిపిస్తాయి.



గ్రేటర్ హైదరాబాద్ ముఖచిత్రం గత దశాబ్ద కాలంలో ఊహించని విధంగా మారిపోయింది. 2010వ సంవత్సరంలో నగర రహదారులపై సుమారు 35 లక్షల వాహనాలు తిరిగేవి. కానీ నేడు ఆ సంఖ్య కోటి ఐదు లక్షలు దాటిపోయింది. అంటే కేవలం 15 ఏళ్ల వ్యవధిలోనే వాహనాల సంఖ్య మూడు రెట్లకు పైగా పెరిగింది. మరి రోడ్ల పరిస్థితి ఏమిటి? వాహనాలు పెరిగిన వేగంతో పోలిస్తే, రహదారుల వెడల్పు, కొత్త ఓవర్‌బ్రిడ్జులు, అండర్‌పాస్ల నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి.

నగరం రాకెట్ వేగంతో పెరుగుతోంది, వాహనాలు తుపానులా వచ్చి పడుతున్నాయి కానీ మన ప్రణాళికలు మాత్రం ఎద్దుల బండి వేగంతో సాగుతున్నాయి. ఇది స్పష్టమైన పాలనా వైఫల్యం కాకుండా మరేమిటి? బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి విలాసవంతమైన ప్రాంతాల నుండి కూకట్‌పల్లి, ఎల్బీ నగర్, దిల్సుఖ్‌నగర్ వంటి రద్దీ ప్రాంతాల వరకు పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. పీక్ అవర్స్‌లో వాహనాలు నిమిషానికి కనీసం రెండు కిలోమీటర్లు కూడా కదలలేని దుస్థితి నెలకొంది. మెట్రో రైలు అందుబాటులోకి వచ్చినా, లాస్ట్ మైల్ కనెక్టివిటీ (స్టేషన్ నుండి ఇంటికి లేదా ఆఫీసుకు చేరే సౌకర్యం) లేకపోవడం వల్ల మెజారిటీ ప్రజలు ఇంకా సొంత వాహనాలపైనే ఆధారపడుతున్నారు.

ఎవీణూా (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అనేక ప్రాజెక్టులు చేపట్టినట్లు కాగితాలపై కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో అమలులో జాప్యం ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది. స్మార్ట్ సిగ్నళ్ళు, ట్రాఫిక్ యాప్లు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. సమస్యను పరిష్కరించాలనే బలమైన రాజకీయ సంకల్పం, పరిపాలనా చిత్తశుద్ధి లోపించాయి. గణాంకాల ప్రకారం, హైదరాబాద్‌లో ఒక సగటు ఉద్యోగి రోజుకు 90 నుండి 120 నిమిషాల విలువైన కాలాన్ని కేవలం ట్రాఫిక్‌లోనే వృథా చేస్తున్నాడు. దీనిని లెక్క గడితే, ఒక వ్యక్తి తన జీవిత కాలంలో సంవత్సరానికి దాదాపు 500 గంటల ఉత్పాదక సమయాన్ని నష్టపోతున్నాడు. ఈ ఆర్థిక నష్టం నగరానికి, రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల భారంగా మారుతోందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ట్రాఫిక్ జామ్ కావడానికి కేవలం వాహనాల సంఖ్య పెరగడమే కారణం కాదు. దీని వెనక వ్యవస్థీకృత లోపాలు ఎన్నో ఉన్నాయి. ప్రధాన రహదారుల పక్కన షాపింగ్ మాల్స్, హోటళ్ళు తమ కస్టమర్ల కోసం పార్కింగ్ స్థలాలు కేటాయించకపోవడంతో వాహనాలు రోడ్లపైనే ఆగుతున్నాయి. పాదచారులు నడవాల్సిన దారిని వ్యాపారులు ఆక్రమించడంతో, ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని రోడ్డు మధ్యలో నడవాల్సి వస్తోంది.

సమన్వయ లోపం ఇదే అతిపెద్ద సమస్య. ఒక రోడ్డు వేసిన వారం రోజులకే దీూచీూ వారు కేబుల్ కోసం తవ్వుతారు, ఆ తర్వాత ఎవీబొూడూదీ వారు పైపుల కోసం తవ్వుతారు. ఇలా ప్రభుత్వంలోని వివిధ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల రోడ్లు ఎప్పుడూ రణరంగంలా కనిపిస్తాయి. ప్రపంచ స్థాయి నగరాల్లో పాదచారులకు, సైకిల్ దారులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. కానీ హైదరాబాద్‌లో సైకిల్ ట్రాక్‌ల గురించి ప్రకటనలు వస్తాయి తప్ప, అవి ఆచరణలో కనిపించవు. రెండు చక్రాల వాహనదారులు, సైకిల్ దారులు, పాదచారులు అందరూ ఒకే ఇరుకైన రోడ్డుపై ప్రయాణించాల్సి రావడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ప్రజా రవాణా వ్యవస్థ (టూూజ) బస్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడం వల్ల సామాన్యులు బస్సు ఎక్కాలంటేనే భయపడుతున్నారు.

సింగపూర్, లండన్, టోక్యో వంటి నగరాలు ఇదే సమస్యను ఎలా అధిగమించాయో మనం గమనించాలి. వారు 'కంజెస్టన్ ప్రైసింగ్' (రద్దీ ప్రాంతాల్లో వాహనాలపై రుసుము), అద్భుతమైన ప్రజా రవాణా, మరియు కఠినమైన ట్రాఫిక్ నిబంధనల ద్వారా రోడ్లను క్లియర్ చేశారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీ అని పిలుచుకుంటున్నప్పుడు, మన ఆలోచనలు కూడా గ్లోబల్ స్థాయిలో ఎందుకు లేవు?

**ఈ అస్తవ్యస్త పరిస్థితిని చక్కదిద్దడానికి కొన్ని ఆచరణాత్మక పరిష్కారాలు**

**ఏకీకృత అథారిటీ:** రోడ్లు, డ్రైనేజీ, మెట్రో మరియు ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయం కోసం ఒక 'సెంట్రల్ కమాండ్ సెంటర్' ఉండాలి.

జరిమానాల విధింపు: రోడ్డు పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లపై, అధికారులపై భారీ జరిమానాలు విధించాలి.

**బస్ ప్రయారిటీ లేన్లు:** బస్సులకు ప్రత్యేక లేన్లు కేటాయిస్తే ప్రజలు సొంత వాహనాలు వదిలి బస్సు ఎక్కుతారు.

**మల్టీ లెవల్ పార్కింగ్:** ప్రతి రద్దీ కేంద్రంలో మల్టీ లెవల్ పార్కింగ్ సముదాయాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలి.

హైదరాబాద్ ఆర్థికంగా ఎంత ఎదిగినా, ఆ వృద్ధి ప్రజల జీవన నాణ్యతను పెంచకపోతే అది వ్యర్థం. ప్రతిరోజూ ట్రాఫిక్‌లో నలిగిపోతూ, కాలుష్యాన్ని పీలుస్తూ గడిపే జీవితం అభివృద్ధి అనిపించుకోదు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం అనేది కేవలం సిగ్నల్స్ సరిచేయడం కాదు, అది ప్రజల సమయాన్ని, వారి శ్రమను గౌరవించడం. ఇది పాలకుల నైతిక బాధ్యత.


అయితే, బాధ్యత కేవలం ప్రభుత్వంపైనే నెట్టేసి సరిపోదు. వాహన దారులుగా మనం కూడా ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలి. అనవసరంగా రోడ్లపై వాహనాలు నిలపకుండా, సాధ్యమైనంత వరకు కార్ పూలింగ్ లేదా ప్రజా రవాణాను వాడటం అలవాటు చేసుకోవాలి. పాలకుల చిత్తశుద్ధి, ప్రజల భాగస్వామ్యం తోడైతేనే హైదరాబాద్‌లోని ట్రాఫిక్ నరకం నుండి మనకు విముక్తి లభిస్తుంది. ఈ విషయం పాలకుల కళ్ళు తెరిపిస్తుందని, నగర భవిష్యత్తుపై ఒక ఆరోగ్యకరమైన చర్చకు దారితీస్తుందని ఆశిద్దాం.

భాగ్యనగరం మళ్ళీ వేగంగా, సాఫీగా కదలాలి. అది మన అందరి హక్కు!

డా. సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# బలిదానాలు వద్దు!

## బలమైన కార్మిక పోరాటాలు నిర్మిద్దాం






తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కార్మిక వర్గం తరువాత బలమైన కార్మిక శక్తిగా ఆర్.టి.సి. ఉద్యోగులు ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎలాగైతే సింగరేణి కార్మికులు తమ బాధ్యతాయుతమైన పోరాటాన్ని నిర్వహించారో, అదే స్థాయిలో ఆర్.టి.సి. కార్మికులు కూడా బలమైన తెలంగాణ ఉద్యమాన్ని కొనసాగించారు. భౌతికంగా తెలంగాణ సాధించుకున్నప్పటికి ఆర్.టి.సి. కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేక పోయాయి. ఈ నేపథ్యంలోనే కరోనా కాలంలో 40 రోజులు సమ్మెలోకి వెళ్ళడం జరిగింది. సమ్మె జరిగినంత కాలం బలిదానాల పోరాటాల రూపంల కనొసాగుతూనే ఉంది. పదుల సంఖ్యలో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాని మన తెలంగాణలో బరిగీసి తెగించి పోరాడటమే తప్ప బలిదానాలు చేసే పోరాట రూపం లేదు. కానీ తెలంగాణ ఉద్యమంలో కొన్ని రాజకీయ పార్టీల కుట్రలో భాగంగా బలిదానాలు కూడా ఒక పోరాట రూపంగా రూపాంతరం చెందాయి. ఆ నేపథ్యంలోనే తెలంగాణలో బలమైన కార్మిక వర్గంగా ఉన్న ఆర్.టి.సి. కార్మిక వర్గం కూడా తమ సమస్యల పరిష్కారం కోసం 'సమ్మె' అనే పోరాట రూపాన్ని తీసుకున్నప్పటికి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో కార్మికులు తమ బాధల్లోంచి తమ సమస్యలకు కూడా ఒక పరిష్కారం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో బలిదానాలు కూడా ఒక పోరాట రూపంగా ముందుకు తీసుకువచ్చాయి. ఇది తాత్కాలికంగా పోరాటానికి ఒక ఉత్తేజాన్ని ఇస్తుందేమో కాని నిజమైన కార్మిక వర్గ పోరాటానికి చాలా ఆటంకంగా మారుతుంది. పోరాటాలపై విశ్వాసం లేని వాళ్ళు తమ బలంపై నమ్మకం లేని వాళ్ళు తీసుకునే ఒక పోరాట రూపమే ఇది. కానీ తెలంగాణ 'తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి' మరియు 80 దశకం నుంచి సాగిన బలమైన అన్ని పోరాటాల్లో కూడా త్యాగానికి సిద్ధపడి శత్రువుతో తలపడిన పోరాట రూపాలే మిగాలాయి తప్ప, బలిదాన పోరాట రూపాలు ఎప్పుడూ లేవు. నేడు నిన్న జరిగిన నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మ హత్య పోరాటం కూడా అందులో భాగంగా జరిగిందనే మనం చూడాలి.

ప్రధానంగా ఏ కార్మిక వర్గం పోరాటం చేసినా ప్రభుత్వాలు చర్చల ద్వారా పరిష్కారాన్ని కనుగొనాలి. అలా కాకుండా పోరాటాలపై నిర్బం ధ రూపాలను అమలు చేయడమే ప్రధాన కర్తవ్యంగా ప్రభుత్వాలు మారాయి. అందులో భాగంగానే పోలీసులు కూడా ఒక బలమైన అణచివేతను పోరాడుతున్న కార్మికులపై అమలు చేస్తున్నాయి. కామారెడ్డి డిపో కార్మికులు తమ సమస్యల పరిష్కారాల కోసం జరుపుతున్న సమ్మెలో భాగంగా టెంటు వేసుకొని ధర్నా చేయాలనే ఉద్దేశ్యాన్ని ప్రభుత్వం పూర్తిగా అణచివేసింది. వేసుకున్న టెంటులను తొలగించడం, టెంట్లు ఎవరన్నా ఇస్తే వారిపైన కూడా కేసులు పెడతామని బెదిరించడం కొనసాగింది. అదే విధంగా ఆర్.టి.సి. సమ్మె పేరుతో ఆర్.టి.సి.సిబ్బంది విధులకు ఆటంకం కలిగించి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధులు నిర్వహించకుండా ఆర్.టి.సి. కార్మికులు ఆపినందుకు వారి మీద కూడా కేసులు నమోదు చేశారు. ఆర్.టి.సి. కార్మికులుగా మేము సమ్మె చేస్తున్నాము, మీరు ఎవ్వరు కూడా మేము చేస్తున్న సమ్మెను విరమించే వరకు మీరెవరూ విధులు నిర్వహించకూడదని అడ్డగించి వాగ్వివాదం చేస్తున్నందుకు వారిపై కూడా కేసులు నమోదు చేశారు. ఇది వరంగల్ జిల్లా తోర్రూరు డిపో దగ్గర జరిగింది. అంతే కాకుండా తొర్రూరులో టెంటు సామాన్లు సమకూర్చారని, సమ్మె పేరుతో సమూహంగా ఏర్పడి తమ విదుల ను ఆటంక పరిచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బెదిరించి బస్ డిపో ముందు సమ్మె చేసిన వ్యకుతలపై మరియు టెంటు సామాన్లు సమకూర్చిన ప్రవీణ్‌పై చట్టపరమైన చర్యల గురించి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేయబడింది.

'తేది: 22-4-2026న వికారాబాద్ జిల్లా తాండూరులోలో కూడా టెంట్ హౌస్ షాపు ఓనర్లు, ఫంక్షన్ హాల్ ఓనర్లు మరియు అసోసియేషన్‌కు సంబ:ధించిన వ్యక్తులందరికి తెలియజేయునది ఏమనగా ప్రస్తుతం ఆర్.టి.సి. కార్మికుల సమ్మె నడుస్తున్నది, ఇట్టి సమ్మె పూర్తిగా చట్టవిర్దుమైనది, గవర్నమెంట్‌కు వ్యతిరేకమైనది, అట్టి సమ్మెకు ఎలాంటి పరిస్మషన్ లేదు, కావున పైన తెలిపిన వ్యక్తులందరూ ఇట్టి సమ్మెకు మీ యొక్క సామాన్లు గాని టెంట్లు గాని ఇచ్చిన అట్టి సమ్మెకు మద్దతు పలికినచో, అట్టి వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని' వికారాబాద్ జిల్లా తాండూరు పోలీసులు పత్రికా ప్రకటన కూడా విడుదల చేయడం జరిగింది.

ఆర్.టి.సి. కార్మికులు తెలంగాణ ఉద్యోమంలో భాగం, తెలంగా ణ ప్రజా రవాణా వ్యవస్థలో మౌళికమైన భాగంగా పని చేస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ కలిగి ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఎందుకంటే సింగరేణి కార్మిక సమాఖ్య బలమైన ఉద్యమాలు కొనసాగించిందో చివరికి సికాస ఆర్గనైజర్లు ఒక ఇంట్లో ఉంటే ఇంటి స్లాబుకు రంధ్రం చేసి పెట్రోల్ పోసి కాల్చి చంపినప్పటికి సింగరేణి ఉద్యమం కొనసాగిన నేపథ్యంలో ఆ ప్రభావంతోనే ఆర్.టి.సి. కార్మిక సమా ఖ్యా పేరుతో బలమైన ఉద్యమం కొనసాగింది. ఇక్కడ కూడా కార్మికులను కూడా కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించిన పరిస్థితులు ఉన్నాయి. అయినప్పటికి తెలంగాణలో ఉన్న ఉద్యమాల ప్రభావంతో ఆర్.టి.సి.లో కూడా బలమైన కార్మిక ఉద్యమాలు కొనసాగి అనేక హక్కులను ఇప్పటికే సాధించుకోవడం జరిగింది. అంతే కాక ప్రధానమైన ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు చాలా కాలం పాటు కొనసాగినందునే ఇప్పటికి కూడా ఆర్.టి.సి. ప్రైవేటీకరణ కాకుండా కాపాడబడగలుగుతుంది. చాలా రాష్ట్రాల్లో ఆర్.టి.సి. ప్రవైటీకరించడి పని చేస్తుంది. మన తెలంగాణలో కూడా ఈ ఎలక్ట్రిక్ బస్సులను కొనసాగించే నేపథ్యంలో అన్ని కూడా ప్రైవేటు వ్యక్తులచే నడుపబడుతున్నాయి. అంతే కాక అన్ని డిపోలలో కూడా అద్దె బస్సులను కొనసాగిస్తున్నాయి. ఆర్.టి.సి. కార్మికులు సమ్మె చేసినప్పుడల్లా అద్దె బస్సులతో, ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సులను నడిపించి సమ్మెను విఫలం చేసే ప్రయత్నం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చాలా బలంగా కొనసాగిస్తున్నది. చివరికి ఆర్.టి.సి.లో యూనియన్ లేకుండా చేసిన కెసిఆర్ ప్రభుత్వం కూడా నేడు జరుగుతున్న ఆర్.టి.సి. సమ్మెను క్రియాశీలకంగా బలపరుస్తున్నది. ఏ బలమైన రాజకీయ పార్టీ కూడా ఆర్.టి.సి. సమ్మె ఉద్యమాన్ని బలంగా ముందుకు నడిపించడంలో ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఆర్.టి.సి. కార్మికులు ఎంత జెఎసిగా ఏర్పడి పోరాటం కొనసాగిస్తున్నప్పటికి, ఈ పోరాటం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్పటి విజయం సాధిస్తామో లేదో అనే అనుమానంతో శంకర్ గౌడ్ బలిదానాల లాంటి సంఘలనలు జరుగుతున్నాయి. పౌరహక్కుల సంఘంగా ఆర్.టి.సి. ప్రజలందరికి తెలియజేస్తున్నది ఏమిటంటే కార్మికులు చాలా బలమైన వాళ్ళు వాళ్ళ పోరాటానికి ప్రజాస్వామిక దేశంలో అనేక వర్గాల ప్రజల మద్దతును కూడగట్టి తమ సమస్యలను సాధించుకోవాల్సిన అవసరం వారిపై ఉంది. అదే వారికి ఉండాల్సిన రాజకీయ చైతన్యం. ఆర్.టి.సి. కార్మికులు ఎప్పుడూ బలహీనులు కారు. ఒకప్పుడు లక్ష వరకు ఉన్న కార్మికులు నేడు సగానికి సగంగా తగ్గిపోయారు. అనేక డిపోలు మూతలు పడుతున్నాయి. అనేక డిపార్ట్‌మెంట్లు ఔట్‌సోర్సింగ్ చేయబడుతున్నాయి. సర్వీసులో ఉన్న ఉద్యోగుల మీద చాలా పనిభారం కొనసాగుతున్నది. విశ్రాంతి అనేది అందకుండా పోతుంది. నిత్యం ఆందోళనే వాళ్ళ జీవితాలలో కొనసాగుతున్నది. ఈ నేపథ్యం నుంచే ఆర్.టి.సి. కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో 'సమ్మె' అనే పోరాట రూపాన్ని వెతుక్కున్నారు. దీన్ని రాష్ట్రంలో ఉన్న అన్ని సంఘాల ప్రజా సంఘాలు అదే విధంగా రాజకీయ పార్టీలన్ని కూడా మద్దతు తెలిపి వాళ్ళ పోరాటాన్ని బలోపేతం చేసి క్రియాశీలకంగా వారితో నడిచి వారి సమ్మెను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. ఇప్పటికే ఆర్.టి.సి.లో కొనసాగిస్తున్న ప్రవేటీకరణను ఇప్పటికైనా ఆపివేయాలి, ఆర్.టి.సి. కార్మికుల 32 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటిని పరిష్కరించి ఆర్.టి.సి. కార్మికుల హక్కులను కాపాడాలని, తెలంగాణ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం యొక్క ప్రధాన బాధ్యత అని పౌరహక్కుల సంఘం గుర్తు చేస్తు ఏ ఒక్క ఆర్.టి.సి. కార్మికుడు బలిదానాలు చేసుకోకూడదని పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిస్తున్నాం.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

# "సామాజిక శాస్త్ర పరిశోధనా విధానాల్లో - మారుతున్న నూతన పోకడల జీవచక్రం"

ఎలక్ట్రానిక్ థీసిస్ అండ్ డిజర్టేషన్ (ఈటిడీ) అనేది కేవలం ఒక ఫైల్‌ను వెబ్‌సైట్‌లో పెట్టడం మాత్రమే కాదు. అది ఒక పూర్తి జీవచక్రం. పరిశోధన అంశం ఎంపికతో మొదలై, రచన, మార్గదర్శక పరిశీలన, సమర్పణ, మూల్యాంకనం, భద్రపరిచడం, ప్రపంచానికి అందుబాటులో ఉంచడం వరకు దీని ప్రయాణం నిరంతరం ఎడతెగక సాగుతుంది. గతంలో ఈ ప్రక్రియ ఎక్కువగా కాగితాల, పత్రాల ఆధారంగా సాగుతూ ఒక పుస్తకం రూపంలో ఉండేది. ఇప్పుడు డిజిటల్ యుగంలో ఈ జీవచక్రం వేగంగా తన రూపు రేఖలు మారుతోంది.

**మొదటి దశ:**

పరిశోధన ఆలోచన. విద్యార్థి ఏ అంశంపై పరిశోధన చేయాలి, ఇప్పటికే ఏమి పని జరిగింది, ఇంకా ఏ లోటు ఉంది అనే విషయాలు తెలుసుకోవాలి. ఇక్కడ (ఈటిడీ)లు ఎంతో ఉపయోగపడతాయి. పూర్వ పరిశోధనలను చూసి కొత్త అంశాలను గుర్తించవచ్చు. ఇదే జీవచక్రం మొదటి ప్రయోజనం.

**రెండవ దశ – రచన:**

గతంలో గ్రంథాలు టైపింగ్, ప్రింటింగ్, సవరణలతో కష్టంగా తయారయ్యేవి. ఇప్పుడు వర్డ్ ప్రాసెసింగ్, సూచనల నిర్వహణ, ఆటోమేటిక్ ఫార్మాటింగ్, భాషా సవరణ (వ్యాకరణ దోషాలు, స్పెల్లింగ్ దోషాల నివారణ) ఫార్మెట్ సెట్టింగ్, డిజైన్ సెట్టింగ్ సాధనాలతో రచన సులభమైంది. మార్గదర్శకులు ఆన్‌లైన్‌లోనే వ్యాఖ్యలు ఇవ్వగలుగుతున్నారు. విద్యార్థి తక్షణమే మార్పులు చేయగలుగుతున్నాడు.

**మూడవ దశ – సమర్పణ:**

పూర్వం బౌండ్ కాపీలు మాత్రమే సమర్పించాల్సి వచ్చేది. ఇప్పుడు విశ్వవిద్యాలయ పోర్టల్‌లో లాగిన్ అయి పత్రాన్ని అప్లోడ్ చేయడం ద్వారా సమర్పణ పూర్తవుతోంది. అవసరమైన ఫారమ్‌లు, ప్రమాణ పత్రాలు, డిక్లరేషన్‌లు కూడా డిజిటల్ రూపంలో ఇవ్వవచ్చు. దీనివల్ల సమయం, ఖర్చు రెండూ తగ్గుతున్నాయి.

**నాలుగవ దశ – సమీక్ష:**

బాహ్య పరీక్షకులు ఎక్కడ ఉన్నా డిజిటల్ కాపీని చూసి అభిప్రాయాలు పంపేవారు. గోప్యత అవసరమైతే పరిమిత యాక్సెస్ ఇవ్వవచ్చు. మార్పులు సూచించిన తర్వాత విద్యార్థి తిరిగి సవరించిన ప్రతిని సమర్పించవచ్చు. ఈ ప్రక్రియ పారదర్శకంగా మారుతోంది.

**ఐదవ దశ – ఆమోదం తర్వాత భద్రపరిచడం:**

ఇది అత్యంత కీలకం. పరిశోధన గ్రంథం కేవలం డిగ్రీ పొందటం కోసం మాత్రమే కాదు; భవిష్యత్తు పరిశోధకుల కోసం మార్గదర్శకాలు ఇచ్చేది కూడా. అందుకే సరైన ఫైల్ ఫార్మాట్, మెటాడేటా, స్థిర లింకులు, బ్యాకప్ వ్యవస్థలు అవసరం. ఒకసారి సమర్పించిన గ్రంథం పది సంవత్సరాల తర్వాత కూడా అందుబాటులో ఉండాలి. అవసరమైన అప్ డేట్ సాఫ్ట్వేర్ ను ఉపయోగించవచ్చు.

**ఆరవ దశ – ప్రజలకు అందుబాటులో ఉంచటం:**

ఓపెన్ యాక్సెస్ విధానం ఉంటే ప్రపంచంలో ఎవరైనా చదవగలరు. ఇది పరిశోధన ప్రభావాన్ని పెంచుతుంది. అయితే కొన్నిసార్లు పేటెంట్ హక్కులు, గోప్య సమాచారం ముఖ్యంగా డిఫెన్స్ స్టడీస్ లో , ప్రచురణ పరిమితులు ఉంటాయి. అప్పుడు ఎంబార్గో కాలం ఇవ్వవచ్చు. అంటే కొంతకాలం తర్వాత మాత్రమే ప్రజలకు ఈ సిద్ధాంత వ్యాసం అందుబాటులో ఉంచడం వంటి చర్యలు తీసుకోవచ్చు.

**ఏడవ దశ – వినియోగం మరియు ప్రభావం:**

ఒక గ్రంథం ఎంత మంది చదివారు, ఎన్ని సార్లు డౌన్‌లోడ్ చేశారు, ఎక్కడ ఉదహరించారు అనే వివరాలు ఇప్పుడు తెలుసుకోవచ్చు. దీని ద్వారా విద్యార్థి పరిశోధన విలువ బయటపడుతుంది.

**ఎనిమిదవ దశ :నవీకరణ:**

కొన్నిసార్లు పరిశోధనలో తప్పులు గుర్తించవచ్చు. అదనపు డేటా రావచ్చు. సవరణ గమనికలు, అనుబంధ ఫైళ్లు, డేటాసెట్‌లు జోడించే అవకాశాలు డిజిటల్ వ్యవస్థల్లో ఉన్నాయి. ఇది కాగిత కాలంలో సాధ్యం అయ్యింది కాదు. మొత్తం థీసిస్ తిరిగి రాయవలసి వచ్చేసింది.

**తొమ్మిదవ దశ – కృత్రిమ మేధస్సు ప్రవేశం:**

ఇప్పుడు ఆటోమేటిక్ మెటాడేటా సృష్టి, సారాంశం తయారీ, సంబంధిత పరిశోధన సూచన, నకిలీ పాఠ్యాల గుర్తింపు వంటి సేవలు జీవ చక్రాన్ని వేగవంతం చేస్తున్నాయి. అయితే మానవ పర్యవేక్షణ అవసరం తప్పనిసరి.

**పదవ దశ – శిక్షణ అలాగే అవగాహన:**

పరిశోధక విద్యార్థులు మంచి పరిశోధన రచన ఎలా రాయాలి, సైటేషన్ ఎలా ఇవ్వాలి, నైతిక ప్రమాణాలు ఏమిటి, డిజిటల్ సమర్పణ ఎలా చేయాలి అనే విషయాల్లో శిక్షణ అవసరం. లేకపోతే సాంకేతిక వ్యవస్థ ఉన్నా ప్రయోజనం ఉండదు.

చివరిగా... మారుతున్న ఎలక్ట్రానిక్ థీసిస్ అండ్ డిజర్టేషన్ (ఈటిడీ) జీవచక్రం ఒక పెద్ద సందేశాన్ని ఇస్తోంది. పరిశోధన ఒక ముగింపు పత్రం కాదు; అది ప్రారంభమైన జ్ఞాన ప్రయాణం. సమర్పణతో కథ ముగియదు. ప్రపంచంతో ఈ నూతన థీసిస్ పంచుకున్నప్పుడు మాత్రమే దాని అసలు విలువ ఏమిటో తెలుస్తుంది. అందుకే విద్యాసంస్థలు ఈ జీవచక్రాన్ని సమగ్రంగా చూడాలి. విద్యార్థి రచన నుంచి సమాజ ప్రయోజనం వరకు ప్రతి దశ బలపడితేనే పరిశోధన సంస్కృతి బలపడుతుంది. విదేశాల్లో ఉన్న ప్రతిభా సంపన్నమైన విశ్వవిద్యాలయాలతో పోటీ పండగలం.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

## ఏవి నేస్తం?

ఏ లెక్కైనా ఏ సుకో!
ఎంత వెనక్కైనా వెళ్ళు!
క్రీస్తు పూర్వమైనా
శాలివాహన శకమైనా
సంవత్సరాల లెక్కైనా
యుగాల లెక్కైనా అంతా భూతకాలం
జరిగినకాలమే బాగుంది!
గతకాలము మెచ్చు వచ్చుకాలము కంటెన్!
ఎవ్వరినైనా అడుగు అందరూ ఒక్కటేమాట!
"దేశం చెడిపోయింది!
గతమే మంచిది
వర్తమానంకంటే " అందరిసమాధానం అదే!
ద్వాపరయుగం వాడికి
త్రేతాయుగం మంచిది!
కలియుగంవాడికి ద్వాపరయుగమేమంచిది
ఈ మొత్తం లెక్కల్లో ఏది భూతకాలం?
ఏది వర్తమానం? ఏది భవిష్యత్కాలం?
కాలం ఏదైనా'వర్తమానం' ఎవ్వరికీ నచ్చదు!
"పాలకులుదుర్మార్గులు!
అంతా దగా, వంచన!"
ఎందుకిలా ఎవరుచెప్పేది
ఏమో ఎవరికి తెలుసు!
రాముడు చెపుతాడా?
క్రిష్ణుడు చెపుతాదా?
ఏసుక్రీస్తు? అల్లా?
ఎవరైనా చెపుతారా?
పోనీ శంకరాచార్యులు?
విజేత అలాగ్జాండర్?
అశోకుడు? అక్బర్?
ఎవ్వరికీ తెలీదు!
తెలిసినవాడొక్కడే
ఆయన కారల్ మార్క్స్!
ఎంత వెనక్కైనా వెళ్ళు
ఆదిమ సమాజం తప్ప
అన్నీ 'వర్గ' సమాజాలే!
'సొంతఆస్తి' సమాజాలే!
ఎవడికివాడి దోపిడీ!
కుమ్ము కుమ్ము ఎంతైనా కుమ్ముకో!
దోపిడీ సమాజాల్లో
'రూపం' మారిన దోపిడీ!
దోపిడీ మాత్రం తప్పదు!
గతకాలానికి మించిన
దోపిడీ వర్తమానంలో!
ప్రపంచమంతా దోపిడీ!
దేశాలాన్నీ మార్కెట్లు,!
అందుకేగతకాలంమెచ్చు
వర్తమానం చచ్చు!
ఒక కవి అడుగుతాడు
"ఏవి నేస్తం?
నిరుడుకురిసిన వానలు?


-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

గత సంచిక తరువాయి

# రాజకీయ ప్రాతినిధ్యం - నిర్ణయాధికారం

తెలంగాణ అస్తిత్వ వేదిక ప్రజలను కేవలం ఓటర్లుగా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి. పథకాలు అర్హుల కు అందేలా పర్యవేక్షించాలి. మార్కెటింగ్ రంగంలో తెలంగాణ ఉత్పత్తులకు గుర్తింపు తెచ్చేలా ఎంటర్ ప్రెన్యూర్ షిప్‌లో శిక్షణ ఇవ్వడం ప్రధాన ఆర్థిక కర్తవ్యం. ఆర్థిక శక్తి లేని అస్తిత్వం కేవలం నినాదాలకే పరిమితమవుతుంది. సంపద సృష్టిలో బహుజనుల వాటాను పెంచడం ద్వారానే సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది. ఉపాధి ఇచ్చే స్థాయికి మనం ఎదగాలి. ఆర్థిక స్వావలంబనే మనకు నిజమైన స్వేచ్ఛను ఇస్తుంది. ఇది మన అస్తిత్వానికి వెన్నెముక వంటిది.

రాజకీయ ప్రాతినిధ్యం – నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కేవలం ఓటర్లుగా కాకుండా, పాలకులుగా ఎదగడమే మన లక్ష్యం కావాలి. జనాభా నిష్పత్తి ప్రకారం చట్టసభల్లో వాటా సాధించాలి. నిర్ణయాధికారం ఉన్న పదవుల్లో బహుజన భాగస్వామ్యం ఉన్నప్పుడే మన వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం రాజకీయ పక్షాలపై ఒత్తిడి తీసుకురావాలి. అధికారం అనేది మన అస్తిత్వాన్ని సుస్థిరం చేసే సాధనం. రాజకీయ చైతన్యం ద్వారానే మనం మన వర్గాల అభివృద్ధికి అవసరమైన చట్టాలను రూపొందించుకోగలం. పాలనలో మన వాటా మన హక్కు. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలమే మన బలం. ఆ బలంతోనే మనం మన అస్తిత్వ రక్షణ కోసం చట్టాలను రూపొందించుకోవాలి.



యువత చైతన్యం – భవిష్యత్తు తరాల అస్తిత్వం తమ మూలాలను మరచిపోకుండా, ఆధునిక ప్రపంచంతో యువత పోటీ పడాలి. సామాజిక స్పృహను పెంపొందిస్తూ, ప్రపంచ దేశాలతో సమానంగా పోటీ పడే స్థాయికి మన యువతను తీర్చిదిద్దాలి. అంతర్జాతీయ స్థాయిలో మన అస్తిత్వాన్ని చాటాల ంటే మనం కేవలం వినియోగదారులుగా కాకుండా, ఆవిష్కర్త లుగా ఎదగాలి. నూతన తరంలో అస్తిత్వ స్పృహను నింపడం ద్వారానే మన సంస్కృతి చిరకాలం వర్ధిల్లుతాయి. యువతకు విజ్ఞానంతో పాటు సామాజిక బాధ్యతను కూడా నేర్పించాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో మన బిడ్డలు అగ్రగామిగా నిలవాలి. భవిష్యత్తు తెలంగాణ యువత చేతుల్లోనే ఉంది. వారు ఆత్మగౌరవంతో ప్రపంచాన్ని జయించాలి. ఇది యువత కు మనం ఇచ్చే వారసత్వం.

సమగ్ర జాతీయ అస్తిత్వం – బహుజన పాత్ర: బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీల వికాసం లేకుండా సంపూర్ణ జాతి అస్తిత్వం అసాధ్యం. దేశ జనాభాలో మెజారిటీగా ఉన్న ఈ వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశాభివృద్ధికి బలం చేకూరుతుంది. బహుజన సంస్కృతులు గౌరవించబడినప్పుడే భారతదేశం అంతర్జాతీయంగా బలమైన అస్తిత్వాన్ని చాటుకో గలదు. భిన్నత్వంలో ఏకత్వం అంటే ప్రతి వర్గం తన ప్రత్యేకత ను కాపాడుకుంటూనే దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావడం. బహుజన వికాసమే జాతీయ వికాసానికి గీటురాయి. అన్ని వర్గాల ఆత్మగౌరవం నిలబడినప్పుడే భారతదేశం ప్రపంచ దేశా ల ముందు గర్వంగా తల ఎత్తుకోగలదు. మనం అందరం కలిసి నూతన భారత అస్తిత్వాన్ని నిర్మిద్దాం. సామాజిక న్యాయమే దేశ బలం.

**అమలు క్యాలెండర్ - జవాబుదారీతనం:**

రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలను అమలు చేయడానికి ఖచ్చితమైన క్యాలెండర్ ప్రకటించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. ప్రజలకు ఇచ్చిన మాటను ఏ తేదీ లోగా అమలు చేస్తారో చెప్పినప్పుడే రాజకీయ పక్షాలకు జవాబుదారీతనం ఉంటుంది. అస్తిత్వ వేదికలు ఈ అమలు క్యాలెండర్‌ను నిరంతరం పర్యవేక్షించాలి. ప్రజల్లో చైతన్యం ఉన్నప్పుడే పాలకులు బాధ్యతగా పనిచేస్తారు. ఆచరణాత్మక అమలు ద్వారానే ఏ సిద్ధాంతానికైనా సార్థకత చేకూరుతుంది. మాటలు కాదు, పనులే ముఖ్యం. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించే హక్కు మనకు ఉంది. ఆ హక్కును వినియోగించుకుని జవాబుదారీతనాన్ని డిమాండ్ చేద్దాం. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వికసిస్తుంది.

**ఆత్మగౌరవ తెలంగాణ నిర్మాణం:**

నాలుగు వేల ఏళ్లచరిత్ర స్ఫూర్తితో, ప్రకృతి సంపదను కాపాడుకుంటూ, అన్ని వర్గాల ఆత్మగౌరవం నిలబడేలా నూతన తెలంగాణను నిర్మిద్దాం. మన మాతృస్వామ్య సంస్కృతిని, నదీ జలాలను మన తర్వాతి తరాలకు అందిద్దాం. అస్తిత్వ చైతన్యం అనేది కేవలం ఒక నినాదం కాదు, అది మన జీవన విధానం కావాలి. విద్యా విప్లవం ద్వారా, ఆర్థిక స్వావలంబన ద్వారా, శాస్త్ర, సాంకేకేతిక నైపుణ్యాల ద్వారా, అందరికీ ఆర్థిక ప్రగతి, సామాజిక రాజకీయ సమానత్వం, మహిళా సాధికారికత, బహుజన సాధికారికత, వలసలు తగ్గించి, బాల కార్మిక వ్యవస్థ లేని మాజ నిర్మాణం అనే మన లక్ష్యాలను సాధించుకుందాం. తెలంగాణ అస్తిత్వ తనకు తాను నిర్ణయించు కున్న కర్తవ్యాలను సాధిస్తూ, సామాజిక సమానత్వం కలిగిన తెలంగాణను నిర్మిద్దాం. ఇది మన తక్షణ కర్తవ్యం. అందరం కలిసి ఆత్మగౌరవంతో ముందుకు సాగుదాం. జై తెలంగాణ! మన ఎరుకే మన అస్తిత్వం. మన అస్తిత్వమే మన గెలుపు కావాలి.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25.04.2026

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లకు

## ఊరట

**మిలియన్ మార్చ్ సందర్భంగా నమోదైన కేసులను కొట్టివేసిన హైకోర్టు**

హైదరాబాద్(జనంసాక్షి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. మిలియన్ మార్చ్ సందర్భంగా నమోదైన కేసులను కోర్టు కొట్టివేసింది. ట్యాంక్ బండ్‌పై 2011లో నిర్వహించిన మిలియన్ మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును నిందితులుగా చేర్చారు. ఈ కేసులో వీరికి ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. దీంతో వీరిపై నమోదైన కేసులను కోర్టు కొట్టివేసింది.

## హెచ్‌సీఏ అవకతవకలపై దర్యాప్తు చేయండి

- సీబీసీఐడీలోని సిట్‌తో దర్యాప్తు జరగాలి
- హైకోర్టు ఆదేశం

4

మంత్రుల కమిటీతో..

# ఆర్టీసీ చర్చలు సఫలం

**విలీనానికి కమిటీ ఏర్పాటు**

**గుర్తింపు సంఘాల ఏన్నికలకు సానుకూలం**

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఆర్టీసీ జేఏసీ నేతల చర్చలు ఫలప్రదం
- మూడు కీలక డిమాండ్లపై మంత్రులు, జేఏసీ నేతల చర్చ
- ఆర్టీసీని బలోపేతం చేసుకుందాం
- బీఆర్ఎస్ పాలనలో సంస్థ చిన్నాభిన్నమైంది
- గత పాలకుల మాదిరిగా మేము వ్యవహరించబోం:డిప్యూటీ సీఎం భట్టి



ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్‌మృతి పట్ల నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం,మంత్రులు, జేఏసీ నేతలు

హైదరాబాద్(జనంసాక్షి):డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ జరిగింది ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.“ఆర్టీసీని మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ చిన్నాభిన్నమైంది. అప్పటి పాలకులు ఎంత కఠినంగా వ్యవహరించారో మీకందరికీ తెలుసు. గత పాలకుల మాదిరిగా మేము వ్యవహరించబోం. ఆర్టీసీకి సంబంధించిన పాలన, విధానపరమైన నిర్ణయాలపై చర్చిద్దాం. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకుందాం” అని భట్టి అన్నారు.మొత్తం

మిగతా 4లో..

**ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఆర్టీసీ డ్రైవర్**

## శంకర్ గౌడ్ మృతి



- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
- ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ సంతాపం
- శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం..
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం: మంత్రి పొన్నం
- అంత్యక్రియల్లో ఉద్రిక్తతలు
- స్వస్థలం ముత్తోజిపేటలో ఘర్షణ వాతావరణం
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే: కేంద్రమంత్రి బండి
- కార్మికులకు అఖిలపక్షం మద్దతు:ఎమ్మెల్యే కూనంనేని
- ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో

మిగతా 4లో..

భారీగా ఐపీఎస్‌ల

## బదిలీలు



- విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్
- మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం
- మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా సుమతి
- ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి





హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు.డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి. సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.



- మే మొదటి వారంలో బాధ్యతలు స్వీకరించే అవకాశం
- 30న ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీ విరమణ

## రాష్ట్ర నూతన డీజీపీ సీవీ ఆనంద్?

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 30న ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత సీవీ ఆనంద్ మే మొదటి వారంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్ ఉన్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఆ స్థానంలో శిఖా గోయల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణవాదంతో మనగడ్డపై

# కొత్త రాజకీయ శక్తి

**కవిత నేతృత్వంలో నూతన పార్టీ ఆవిర్భావం నేడు..**

- పూలే, అంబేద్కర్, ప్రొ జయశంకర్ ఆశయ సాధనే లక్ష్యంగా..
- దళిత, బీసీల అభ్యున్నతికి పాటుపడనున్నట్టు పోస్టర్ ఆవిష్కరణ
- సభా ప్రాంగణం వద్ద ఉట్టిపడుతున్న తెలంగాణ సంస్కృతి

4 లో..

తెలంగాణ గడ్డపై తెలంగాణవాదంతో మరో కొత్త రాజకీయ శక్తి ఆవిర్భవించనుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన నూతన రాజకీయ పార్టీని నేడు లాంఛనంగా ప్రకటించనున్నారు. గత కొంతకాలంగా బీఆర్ఎస్‌తో విభేదిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న ఆమె.. పార్టీ ప్రకటిస్తుండటంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, ఎజెండాను ఆవిష్కరించేందుకు అన్నివిధాలా సిద్ధమయ్యారు.



90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు

# ప్రభుత్వం సన్నద్ధం

**రబీ సీజన్‌లో 8500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

- ఇప్పటికే 5వేల కేంద్రాలు ప్రారంభం
- కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు
- ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు రవాణ వసతి కల్పించాలని ఆదేశం



## ‘ఎస్ఎల్‌బీసీ’ని త్వరితగతిన పూర్తి చేయాలి

- కాళేశ్వరం మరమ్మతులలోనూ భాగస్వామ్యం కావాలి
- ఎన్‌జీఆర్ఐ సంస్థకు సూచించిన మంత్రి ఉత్తమ్

12 లో..

హైదరాబాద్(జనంసాక్షి): రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికా రులను ఆదేశించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు. రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల పక్రియపై శుక్రవారం సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు,జెనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు, మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగినందున అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా

మిగతా 4లో..

## ఆప్‌పై భాజపా భారీ వల

**గోడదూకిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు**

- ఈ ద్రోహాన్ని పంజాబ్ ప్రజలు క్షమించరు : కేజ్రీవాల్
- ఈడీ, సీబీఐలతో భయపెట్టి వారి పార్టీలో చేర్పించుకున్నారు
- భాజపా మళ్లీ ‘ఆపరేషన్ లోటస్’ను ప్రారంభించిందని ఆగ్రహం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆమ్‌ఆద్మీ పార్టీకి రాఘవ్ చడ్డా రాజీనామా చేశారు. భాజపాలో చేరనున్నట్లు చెప్పారు. ఇటీవలే ఆయన్ను పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి ఆప్ తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. శుక్రవారం దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో చడ్డా మాట్లాడుతూ.. “రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాజ్యసభలో ఆప్‌నకు చెందిన మూడింట రెండొంతుల మంది సభ్యులమైన మేము భాజపాలో విలీనం కావాలని నిర్ణయించుకున్నాం. 15 ఏళ్లపాటు నా రక్తం, చెమట ధారపోసి ఆప్ ఎదుగుదలకు కృషి చేశా. కానీ, అది ఏ ఉద్దేశాలతో ఏర్పడిందో వాటికి దూరంగా జరిగింది. కొన్నేళ్లుగా ఆ పార్టీ దేశం కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోంది.

మిగతా 9లో..





## భారీ ఓటింగ్ బీజేపీ అధికారానికి సూచిక

- బెంగాల్‌లో జంగిల్ రాజ్ ఖేల్ ఖతం
- టీఎంసీ పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ
- ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు



కోల్‌కతా(జనంసాక్షి): పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా

మిగతా 9లో..



## ప్రజాస్వామ్య పద్ధతిలో ‘హిల్ట్’ పాలసీ

నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

- మే మొదటి వారం నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువను అమలులోకి తీసుకురండి
- క్యాబినెట్ సబ్ కమిటీ భేటిలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్ నగరం తో పాటు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్) తీసుకువచ్చిందని, ఈ పాలసీని ప్రజాస్వామ్య పద్ధతిలో అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. శుక్రవారం డాక్టర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ రిసోర్స్ మొబ లైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. హిల్ట్ పాలసీపై సమీక్ష సమావేశంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు సైతం పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు. ఎయిర్ పొల్యూషన్

మిగతా 4లో..

## సమయం మించిపోతోంది త్వరగా ఒప్పందానికి రండి

- ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు
- యుద్ధంలో అణ్వాయుధాలు వాడే ప్రణాళిక తనకు లేదని స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు
- ఇజ్రాయెల్- లెబనాన్ కాల్పుల విరమణ పొడిగించినట్లు ప్రకటన



వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అణ్వాయుధాలు వాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పష్టం చేశారు. ఈ క్రమంలో తమతో ఒప్పందానికి రావాలని.. సమయం మించిపోతోందని టెహ్రాన్‌కు ఆయన హెచ్చరికలు చేశారు. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు.ఇరాన్‌తో యుద్ధంలో అణ్వాయుధాలు వాడే ప్రణాళిక తనకు లేదని ట్రంప్ పేర్కొన్నారు. ‘నేను ఎందుకు అణ్వాయుధాన్ని ఉపయోగిస్తాను? అది లేకుండానే సంప్రదాయ యుద్ధ పద్ధతుల్లో మేము వారిని ఇప్పటికే నాశనం చేశాం. నేను దాన్ని ఉపయోగించను. అణ్వాయుధాన్ని ఉపయోగించడానికి ఎవరినీ, ఎప్పటికీ అనుమతించకూడదు’ అని ట్రంప్ అన్నారు. ఈ సందర్భంగా టెహ్రాన్‌తో ఒప్పందానికి తాను తొందరపడటం లేదని ట్రంప్ పేర్కొన్నారు. త్వరిత పరిష్కారం కంటే స్థిరమైన, దీర్ఘకాలిక ఒప్పందం పైనే దృష్టిసారించినట్లు తెలిపారు. ఇటీవల ముగిసిన రెండు వారాల కాల్పుల విరమణలో ఇరాన్ తన ఆయుధ వ్యవస్థలను పునరుద్ధరించుకొని ఉండవచ్చన్నారు.

మిగతా 9లో..

## పాక్‌కు ఇరాన్ మంత్రి అరాఘ్చీ..!

**మలివిడత చర్చల కోసమేనా.. ?**

టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా–ఇరాన్ మధ్య మలి విడత చర్చలు ఉంటాయో లేదో.. ఒప్పందం కుదురుతుందో లేదో.. తెలియని అనిశ్చితి నెలకొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం వరుసపెట్టి హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. ఈ సమయంలో శుక్రవారం ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ పాకిస్థాన్‌కు వెళ్లనున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆయన వెంట ఒక బృందం కూడా వెళ్తుందని పేర్కొన్నాయి. మరోవైపు యూఎస్‌కు చెందిన కొన్ని బృందాలు పాక్‌లోనే ఉన్నాయని తెలుస్తోంది. అరాఘ్చీ తన పర్యటనకు ముందు పాకిస్థాన్ డిప్యూటీ పీఎం, విదేశాంగ

మిగతా 4లో..

# ఆర్టీసీ కార్మికులు దొంగలా? లంగాలా?

▫ కేంద్ర మంత్రి బండి సంజయ్



నర్సంపేట, ఏప్రిల్ 24 (జనంసాక్షి) : నర్సంపేట నియోజకవర్గం లో నిన్న ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ నివాళు లర్పించేందుకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ మృతుడి కుటుంబానికి పరామర్శించి నివాళు లర్పించారు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపు లేకుండా పనిచేస్తుందని ప్రభుత్వంపై మండిపడ్డారు. మృతి చెందిన శంకర్ గౌడ్ పార్థివ దేహాన్ని ఆర్టీసీ డిపో వద్దకు అనుమతి ఇవ్వాలని పోలీస్ వారికి అడగ వారు ఐదు నిమిషాలు ఇవ్వాలని అడగగా అనుమతి ఇవ్వలేదని వారిపై మండిపడ్డారు ఆర్టిసి కార్మికులు దొంగల లంగాల అన్నారు. వారికి ఎలాంటి స్వేచ్ఛ లేదని లేదని పేర్కొన్నారు. పోలీసులు కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని. ప్రభుత్వపరంగా వచ్చేటని రావని అంటున్నారని అయినా ఆరోపించారు కొద్దిసేపు ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడవాలని కోరారు వారి కుటుంబానికి ఆర్థిక సాయం. కుటుంబ సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రి బండి సంజయ్. కోరారు.

# బండి సంజయ్‌ది శవరాజకీయం

▫ మండిపడ్డ అద్దంకి దయాకర్



హైదరాబాద్, ఏప్రిల్24 (జనంసాక్షి) : ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ శవ రాజకీయాలు చేస్తున్నారని దయాకర్ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. శంకర్ మృతిని కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయం చేస్తున్న తీరు హేయం, సిగ్గుచేటు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు బీఆర్ఎస్ నాయకులు కార్మికులను రెచ్చగొడుతుంటే.. మరోవైపు బీజేపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో ఉద్రిక్తతలకు కారణం బండి సంజయ్ అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి అన్న విషయాన్ని మర్చిపోయి బండి సంజయ్ కార్మికులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా స్పందించిందో అందరికీ తెలుసన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా శంకర్ గౌడ్ కుటుంబాన్ని కలిసి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. శంకర్ గౌడ్ కుటుంబం పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, చనిపోయిన ఆర్టీసీ కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని సర్కార్ ప్రకటించిందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే... బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ మండిపడ్డారు. సీఎం, మంత్రివర్గం అంతా.. ఆర్టీసీ కార్మికులు తొందరపడవద్దని విజ్ఞప్తి చేశారన్నారు. సమస్య పరిష్కారానికి తాము ప్రయత్నిస్తుంటే.. బండి సంజయ్, బీఆర్ఎస్ నేతలు మాత్రం ఓట్లు వెతుక్కుంటున్నారని విమర్శించారు. దయచేసి ఆర్టీసీ కార్మికులు ఇలాంటి క్షుద్ర రాజకీయ పార్టీలను, నాయకులను నమ్మొద్దని.. కచ్చితంగా కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

# దుచర్ల సత్యనారాయణకు చెరుకు సుధాకర్, అనంతుల మధు పరామర్శ



సూర్యాపేట (జనంసాక్షి) : గురువారం సాయంత్రం జలసాధన సమితి వ్యవస్థాపకుడు, ప్రముఖ సామాజిక వేత్త దుచ్చర్ల సత్యనారాయణ మోతె మండలం రాఘవాపురం లోని ఆయన స్వంత 70 ఎకరాల చిట్టడవిలో గొర్రెల కాపలా దారుల చేతిలో దాడికి గుయ్యారు. సూర్యాపేట ప్రభుత్వ ఏరియా జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న దుషర్ల సత్యనారాయణను సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌లో తెలంగాణ ఉద్యమ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, తెలంగాణ యువజన సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా చెరుకు సుధాకర్, అనంతుల మధు మాట్లాడుతూ కృష్ణా గోదావరి నీటి వాటాలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి జలసాధన సమితిగా నల్లగొండ మహబూబ్నగర్ ఖమ్మం ఇంకా అనేక జిల్లాల్లో పాదయాత్రలు చేసి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమ పునాదిని పరిపుష్టం చేసిన దుశ్చర్ల సత్యనారాయణపై ఇష్టపడి కష్టంతో కాపాడుతున్న మానవ నిర్మిత మహారణ్యంలో గొర్రెల కాపలాదారులు తోలి ఆగం చేయొద్దన్నందుకు దాడి చేసి గాయపరచడం తమని కలచి వేసిందని అన్నారు. ప్రభుత్వం స్పందించి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

# జేఈఈ మెయిన్స్‌లో మైనారిటీ గురుకుల విద్యార్థుల హవా

▫ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో మైనారిటీ గురుకుల సొసైటీకి చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించడంపై మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనారిటీ సీఓఈ, నాన్-సీఓఈ కాలేజీలకు చెందిన 105 మంది విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరుకాగా, అందులో 35 మంది అర్హత సాధించారని తెలిపారు. వీరిలో 7 మంది 90 శాతం పైగా, 16 మంది 80 పర్సంటైల్‌కు పైగా స్కోర్ సాధించినట్లు చెప్పారు. మొత్తం ఫలితాల్లో జనరల్ కేటగిరీలో 93.42%, ఈ డ బ్ల్యు ఎ స్ లో 82.42%, ఓబీసీలో 80.92%, ఎస్సీలో 63.9%, ఎస్టీలో 52.01% ఉత్తీర్ణత న వ ా ా ద్ా ై న ట ్ల వివరించారు. ఇతర గురుకులాల కంటే మైనారిటీ గురుకుల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం జరిగిందని, కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్న మైనారిటీ గరుకులాలను మైనారిటీలతో పాటు నాన్ - మైనారిటీ విధ్యార్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# కేదార్‌నాథ్‌కు భారీగా భక్తుల రాక



డెహ్రాడూన్, ఏప్రిల్24 (జనంసాక్షి) : చార్‌ధామ్ యాత్రలో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. గఢ్వాల్ హిమాలయాల పర్వత శ్రేణిలోని ఈ ఆలయానికి తొలి రోజే భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. ఒకానొక దశలో భక్తులను కట్టడి చేయడం ఆలయ సిబ్బందికి కష్టతరంగా మారింది. మరో వైపు స్వామి వారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు నిబంధనలు అతిక్రమిస్తూ.. ఒక క్యూ లైన్ నుంచి మరో క్యూ లైన్‌లోకి చొరబడుతున్నారు. దాంతో వారి మధ్య ఘర్షణ, వాగ్వివాదం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు.

# నర్సంపేటలో టెన్షన్... టెన్షన్...

## ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ మృతితో భగ్గుమన్న కార్మిక లోకం

▫ మృతుడు శంకర్ గౌడ్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ నివాళి

▫ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యేలు మంత్రుల పరామర్శ

▫ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

▫ బీఆర్ఎస్ నాయకులను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలింపు



వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 24 (జనం సాక్షి) : పాలక ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సమ్మెబాట పట్టిన ఆర్టీసీ కార్మికులు సమ్మె కొనసాగుతుండగా నర్సంపేట డిపో చెందిన ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ గురువారం రాత్రి మృతి చెందడంతో వరంగల్ ఉమ్మడి జిల్లా ఒక్కసారి ఉలిక్కిపడి కార్మిక లోకం పాలకుల తీరుపై భగ్గుమంది. శుక్రవారం ఉదయం నుండే వరంగల్ జిల్లాలో పలు డిపోల్లో ఆర్టీసీ కార్మికులు జేఏసీ ఆధ్వర్యంలో బంద్ ,పికేటింగులు నిర్వహించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గేటు ధర్నాలు టికెట్లు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా సాచివేత వైఖరిని అవలంబిస్తుండడంతో ప్రభుత్వం తీరుని ఎండగట్టారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ కోల శంకర్ గౌడ్ మృతి చెందగా కార్మిక లోకం నర్సంపేట డిపో వద్ద మృతుడు కోలశకర్ గౌడ్ మృతదేహం నర్సంపేటకు తరలించడానికి ప్రభుత్వ అధికారులకు పోలీసులు పడరాని పాట్లు పడ్డారు.

### నర్సంపేటలో తీవ్ర ఉద్రిక్తత...

కేంద్రమంత్రి బండి సంజయ్ వరంగల్ నుండి నర్సంపేటలోని ముత్తిజిపేట గ్రామానికి రావడానికి బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా. నర్సంపేట సబ్ డివిజన్లో భారీ బందోబస్తు హై సెక్యూరిటీ మధ్య స్థానిక బస్టాండ్, వరంగల్ సెంటర్ మహేశ్వరం ప్రాంతాలలో భారీ సెక్యూరిటీ మధ్య వాహనాలను తనిఖీ చేస్తూ కేంద్రమంత్రి బండి సంజయ్ ని అడ్డుకోగా మృత కుటుంబాన్ని పరిశీలించకూడదని మంత్రి బండి సంజయ్ కి పోలీసులకు మధ్య తీవ్రవాదం జరిగింది. ఒక బండి సంజయ్ వాహనాన్ని పంపించి మిగతా వాహనాలను అడ్డుకోవడంతో తీవ్ర ఉధృత పరిస్థితులను నెలకొన్నాయి. అనంతరం బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, నర్సంపేట ఆర్టీసీ డిపోకు రాగా మృతుడు కుల శంకర్ మృతదేహం ఆర్టిసి బస్ డిపోకు తీసుకురావాలనే ప్రయత్నాలు చేయడంతో స్థానిక పోలీసులు నిరాకరించారు. దీంతో మృతదేహాన్ని మృతుడి కూతురు స్వగ్రామమైన ముత్తోజిపేటకు తరలించారు.

### ముత్తోజిపేట కేంద్రంగా నిరసనలు.. ఉద్రిక్తత

నర్సంపేట మండలం ముత్తాజిపేట గ్రామంలో ఆర్టీసీ కార్మికుడు కోల శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళులర్పించడానికి వచ్చిన అధికారులు ప్రజాప్రతినిధులు వివిధ ప్రజా సఘాల నాయకులు ప్రతిపక్షాలను పార్టీల నాయకులు ముత్తాజిపేట గ్రామానికి చేరుకోవడంతో వందలాది మంది పోలీసుల బందోబస్తు మధ్య మృతదేహానికి నివాళు లర్పించడానికి పోటీపడ్డారు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బిజెపి వీఆర్ఎస్ ఆర్టీసీ కార్మికులు నినాదాలు చేశారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించాలని ఉద్యోగం ఇవ్వాలని నినాదాలు మిన్ను ముట్టడంతో ఒక్కసారిగా ముత్తూజిపేట గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ సంఘటన స్థలానికి విచ్చేసి శాంతి భద్రతల పరిరక్షించడానికి భారీ పోలీసులు డిఎస్పీలు సిఐలు ఎస్ఐలు పర్యవేక్షణలో ఉద్రిక్త వాతావరణం ప్రశాంతంగా నేలకల్పడానికి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. టిఆర్ఎస్ పార్టీ నాయకులను జిల్లాలోని పోలీస్ స్టేషన్ లకు కాకుండా జనగామ జిల్లా, ఖమ్మం జిల్లా కారేపల్లి , జిల్లాను దాటించి ఇతర జిల్లాలలోని పోలీస్ స్టేషన్లలో టిఆర్ఎస్ నాయకులను ఉద్రిక్త వాతావరణం శాంతింప చేయడానికి కృషి చేశారు. అనంతరం నర్సంపేట ఆర్డీవో ఉమారాణి సంఘటన స్థలానికి విచ్చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి కోల శంకర్ గౌడ్ మరణానికి సంతాపం తెలిపి నివాళులర్పించారు .. భాదిత కుటుంబానికి 10 లక్షల పరిహారం ప్రభుత్వం అందిస్తుందని అదేవిధంగా కుటుంబంలోని వ్యక్తికి ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తామని., ప్రత్యేకంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో 5 లక్షల రూపాయలు సహాయం అంద చేస్తారని ప్రకటించారు. దీంతో శాంతించని ప్రజాసంఘాల నాయకులు కార్మికులు వివిధ పార్టీల నాయకులు నినాదాలు చేయడంతో ఉద్రిక్త నెలకొంది. మృతుడు కోల శంకర్ గౌడ్ అకాల మరణం కార్మిక వర్గంలో తీవ్ర మనస్థాపం చెందగా ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించకపోవడం మొండివైఖరికి నిదర్శనమని కార్మిక వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. జిల్లాలో ఎట్టకేలకు పరిస్థితులు చక్కదిద్దడానికి జిల్లా పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు..

# హైదరాబాద్ బుక్‌ఫెయిర్ వ్యవస్థాపకులు గోపాలరావు మృతి



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు ఎస్.గోపాల రావు(90) గురువారం కొండాపూర్‌లోని తన కుమారుడి నివాసంలో మృతి చెందారు. గోపాలరావు గురువారం కొండాపూర్‌లోని తన కుమారుడి ఇంట్లో అనారోగ్య కారణాలతో అకాల మరణం పొందారు. వారి భౌతిక దేహాన్ని ఆదివారం నాడు ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని తన గృహంలో మిత్రుల సందర్శనార్థం ఉంచి, అంత్యక్రియలు నిర్వహించ నున్నారు. సోము గోపాలరావు 1986లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ వ్యవస్థాపకుల్లో ఒకరు. తొలి పుస్తక ప్రదర్శనకు సమన్వయకర్తగా వ్యవహరించారు. సైంటిఫిక్ సర్వీసెస్ అనే సంస్థ ద్వారా వారు పుస్తక రంగానికి సేవలు అందించారు. అనేక పుస్తక ప్రదర్శనల నిర్వహణలో వారి పాత్ర వున్నది. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డా.కవియాకూబ్, ఉపాధ్యక్షుడు మలుపు బాల్ రెడ్డి, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.వాసు, కోశాధికారి నారాయణరెడ్డి సంతాపాన్ని తెలియజేస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు.

# డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24(జనంసాక్షి): నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి శుక్రవారం డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉట్నూర్, ఆసిఫాబాద్ రహదారి పనులకు కాంట్రాక్టర్‌కు రావలసిన బకాయిలు చెల్లించాలని, అసంపూర్తిగా ఉన్న కెరమెరి, లక్మాపూర్ బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌ను కలిశారు. పాఠశాలలకు సమీపంలోని పిహెచ్సి వైద్యులు వారానికి ఒకసారి పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కెరమెరి మండలం కోటపరం దోలి జంగుబాయి దేవస్థానం కమిటీకి 2024 సంబంధించిన రూ.10 లక్షల బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పెన్షనర్ల సంఘాల నాయకుల అరెస్టు అప్రజాస్వామికం



హైదరాబాద్ (జనంసాక్షి) : పెన్షనర్ల సంఘాల నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని టాప్ర రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎంఎన్‌రెడ్డి, అధ్యక్షులు పి.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ఆర్థిక కార్యదర్శి జి.అశోక్ అన్నారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం ఆర్టీసి కార్మికులు శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలకు సంఘీభావం తెలపడానికని రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు ప్రదర్శన శిబిరాల వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో టాప్ర నాయకులు ఎన్ బ్రహ్మచారి, ఎం క్రిష్ణారావుల నాయకత్వంలో సంఘీభావం తెలపడానికి వెళ్లిన నాయకులు బలరాం, బిజెఎం రెడ్డి, భగవంత రెడ్డి, బిక్షపతి దామోదర్ రెడ్డి తదితరులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ అబ్దుల్లాపూర్ మెట్ కు తరలించారు. ఈ సందర్భంగా టాప్ర నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు మానిఫెస్టో లో పెట్టి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా అమలు చేసే ప్రయత్నం చేయకపోగా ఆర్టీసి ని మొత్తంగా ప్రైవేటు వారికి అప్పగించే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టాప్ర ఆన్ లైన్ లో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమ్మెలో ఉండగా ప్రైవేటు వారి సహాయంతో బస్సులు నడపాలని చూడడంలో ఉన్న శ్రద్ధ వారి సమస్యల పరిష్కారంలో చూపడం లేనట్లుగా కనబడుతోందని దుయ్యబట్టారు. నిరుద్యోగులు ఎవరూ బస్సులు నడపడానికి ముందుకు రావద్దని సూచించిందని, వెంటనే పోలీసు నిర్బంధాలను తొలగించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బీజేపీలో చేరటం లేదు

## వందేమాతరం సామూహిక గీతాలపనకు మోడీని ఆహ్వానించేందుకే వెళ్లా

▫ మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 24 (జనంసాక్షి) : కొంతకాలంగా మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు కోడలు ప్రీతి రెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం ఉదయం ప్రీతి రెడ్డి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం ప్రీతి మాట్లాడుతూ.. తాను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో టచ్‌లో ఉన్నది వాస్తవమే అని అన్నారు. అయితే బీజేపీలో చేరతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సామూహిక వందేమాతర గీతాలాపన కోసం మోదీని కలిసి ఆహ్వానించినట్లు చెప్పారు. మోదీ వస్తే పెద్ద ఈవెంట్ అవుతుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం బీజేపీ కార్యాలయంలో చంద్ర శేఖర్ తివారీని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. 'మా మామ మల్లారెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉంటారు' అంటూ ప్రీతి రెడ్డి తేల్చిచెప్పారు. ఇటీవల కుటుంబసభ్యులతో సహా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా బీజేపీ కార్యాలయానికి ప్రీతి రెడ్డి రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రధానిని ఎందుకు కలిశారో చెప్పి.. ఈ ప్రచారానికి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

# నర్సంపేట వెళ్లకుండా బిఆర్ఎస్ నేతల అడ్డగింత

మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ తదితరుల అరెస్ట్



జనగామ, ఏప్రిల్24 (జనంసాక్షి) : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంతిమ యాత్రలో పాల్గొనడానికి వరంగల్ జిల్లా నర్సంపేట వెళు తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను స్టేషన్ ఘనాపూరం మార్గ మధ్యలో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు మాజీ హోంమంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోతు కవితను జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ గేట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న జనగామ శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి వెంటనే రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌కు కార్యకర్తలతో చేరుకొని, స్టేషన్ ఎదురుగా బైఠాయించారు. బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, వారి మరణానికి కారణమైందని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి వారి అపాయింట్మెంట్ డేటును ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తక్షణం ఆస్తిపన్ను చెల్లించండి

ఐదుశాతం రాయితీకి మరో నాలుగు రోజుల గడువు

నల్లగొండ, ఏప్రిల్24 (జనంసాక్షి) : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ పొందేందుకు కేవలం 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర కోరారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు తమ ప్రాపర్టీ పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును తక్షణమే చెల్లించి, రాయితీ ప్రయోజనాన్ని పొందాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా నగర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి కాల్వల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పన్నుల వసూలు కీలకమని తెలిపారు. పౌరులందరూ ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు వాటర్ ట్యాక్స్ అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించాల్సిందిగా కోరారు. ప్రజల సహకారం లేకుండా నగర అభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం ద్వారా నల్లగొండను మరింత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు.

# అధికారికంగా వాసవి మాత జయంతి ఆర్యవైశ్యులకు గర్వకారణం

- సీఎం, మంత్రి, చైర్మన్ లకు పాలభిషేకం చేసిన ఆర్యవైశ్యులు
- తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కొత్త శ్రీనివాస్ గుప్తా



**మక్తల్, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేయడం ఆర్యవైశ్యులందరికి గర్వకారణం అని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం మక్తల్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ గుప్తా అన్నారు. వాసవి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తో పాటు రాష్ట్ర మంత్రివర్గానికి, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత కు ఆర్యవైశ్యుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి వాకిటి శ్రీహరికి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతకు ఆర్యవైశ్య నాయకులు పాలభిషేకం చేశారు. శుక్రవారం మక్తల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కొత్త శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తూ అమ్మవారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ప్రజలందరితో మమేకమై సేవా కార్యక్రమాలలో ముందుండే ఆర్యవైశ్యుల పట్ల పాలక ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఆర్యవైశ్య సంఘం, మహిళ సంఘము, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత ఆర్యవైశ్యుల తరఫున చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి, మంత్రిమండలి సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని అన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత ఆధ్వర్యంలో ఎల్ బి స్టేడియంలో నిర్వహించిన వాసవి మాత పారాయణం గిన్నిస్ బుక్ రికార్డు నమోదు చేసుకుందన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల విజ్ఞప్తిని మన్నించిన ముఖ్యమంత్రి వాసవి మాత జయంతికి నాలుగు రోజుల ముందే అధికారికంగా వాసవి మాత జయంతి వేడుకలను నిర్వహిస్తూ నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆర్యవైశ్య సమాజం ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తుందని అన్నారు. ఆర్యవైశ్యులంతా రాష్ట్ర ముఖ్యమంత్రి కి రుణపడి ఉంటామని తెలిపారు. ఈనెల 26న వాసవి మాత జయంతి సందర్భంగా మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారి పుష్కరిణి (కోనేరు) నుండి 108 కళాశాలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు శోభాయాత్ర, అభిషేకం, సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి ఒడి బియ్యం, అన్నదానం మిగిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో ఆర్యవైశ్యులు, హిందూ బంధువులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య సంఘం పెద్దలు మనసాని వెంకటేష్ గుప్తా, బిలకంటి జగదీష్, దోంత్త నరహరి, మనసాని నాగరాజు, కల్వ శ్రీనివాస్, ఉదయ్, బిలకంటి నరసయ్య, వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ, వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వాల ప్రసన్న, మహిళ సంఘము మజీ అధ్యక్షులు మనసాని సరళ దేవి, పాలుట్ల సుష్మ, చల్ల రూప తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రీ సర్వేతో భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**పెదశంకరంపేట, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** భూభారతి రీ సర్వేతో గ్రామీణ ప్రాంతాలలో భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్ద శంకరాపేట మండల పరిధిలోని కమలాపూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు సంబంధించి భూ వివాదాలకు పరిష్కరిచనమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వే కార్యక్రమం చేపట్టిందని వివరించారు. రైతులకు సంబంధించిన ప్రతి గుంట భూమికి స్పష్టమైన హద్దులు. రికార్డులు లభిస్తాయి అని వివరించారు. రీ సర్వే సమయంలో రైతులు క్షేత్రస్థాయిలో ఉండి తమ భూమికి సంబంధించిన సరిహద్దులను అధికారులకు చూపించాలని ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సరి చేసుకోవాలని వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తాగుతున్న ఈ సర్వే అత్యంత పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ప్రభుదాస్. ఎంపీడీవో క్రాంతి కుమార్. సర్పంచ్ కుంట్ల సుజాత రాములు. . ఆ యా శాఖల అధికారులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మొకార్లబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న బస్సుకు ఢీ
- అక్కడికిఅక్కడే వ్యక్తి మృతి



**మహమ్మదాబాద్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** మండలంలోని ముకర్లబాద్ గ్రామ స్టేజి సమీపంలో బైక్‌పై అతివేగంతో వచ్చి ఆగిఉన్న బస్సును ఢీకొట్టుకొని అక్కడికిఅక్కడే మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే..కుల్కచర్ల మండలం అంతారం గ్రామ సమీపంలో ఉన్న చింతలకుంట తండకు చెందిన శ్రీను (తండ్రి పెంటేనాయక్) మహబూబ్ నగర్ నుంచి తన సొంత గ్రామానికి చేరుకోవడానికి బైక్ పై బయలుదేరాడు ఈక్రమంలో ముకర్లబాద్ గేటువద్ద ప్రయాణికులను దింపేందుకు ఆగి ఉన్న బస్సును,టీఎ12శఖీ8576,నెంబర్ గల బైక్ వేగంతో వెనక్కి నుంచి వచ్చి బస్సు ఢీకొట్టుకొని అక్కడికక్కడే మృతిచెందాడు.సమాచారం తెలుసుకున్న మహమ్మదాబాద్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు తరలించారు.ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

# రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

- జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** యాసంగి (రబీ) సీజన్‌లో వరి కొనుగోళ్ల సందర్భంగా పొరుగు రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రానికి వరి ధాన్యం అక్రమంగా రాకుండా, అలాగే రాష్ట్రంలోని పీడీఎస్,సి ఎం ఆర్ బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలింపు ను నిరోధించేందుకు నారాయణపేట జిల్లా పరిధిలోనీ రాష్ట్ర సరిహద్దుల్లో మొత్తం 6 బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.చెక్ పోస్టులు ఇవే..నారాయణపేట మండలం జలాల్పూర్, దామరగిద్ద మండలం కాన్కుర్తి,కృష్ణ మండలం చేగుంట, కృష్ణ బ్రిడ్జి, ఉట్కూర్ మండలం సమిస్తాపూర్, మాగనూర్ మండలం ఉజ్జెల్లి చెక్‌పోస్ట్ లు ఏర్పాటు చేసినట్లు ఎస్పీతెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద పోలీస్ ,రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయబడుతుందని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రం నుండి వరి ధాన్యం అక్రమంగా రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి సంబంధించిన వే బిల్, ఇతర రవాణా పత్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, అనుమతులు లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి వాహనం యొక్క రిజిస్ట్రేషన్ నంబర్, డ్రైవర్ వివరాలు, గమ్యస్థానం వంటి సమాచారాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.వరి వ్యాపారంలో పాల్గొనే వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద మాత్రమే కాకుండా, బోర్డర్ గ్రామాల ద్వారా అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక పహారా ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సై లు చెక్‌పోస్టుల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, విధుల్లో ఉన్న పోలీస్ ,రెవెన్యూ సిబ్బందిని తరచూ తనిఖీ చేస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా ప్రజలు కూడా సహకరించి, అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ వరి రవాణా గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



**సిద్దిపేట బ్యూరో, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. అలాగే ఐకేపీ కేంద్రాల్లో రైతులకు అవసరమైన నీడ, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తేమ శాతం రాగానే ధాన్యాన్ని వెంటనే పారదర్శకంగా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో గన్ని బ్యాగులు, తేమ కొలిచే పరికరాలు, తూకం కాంటాలు, వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తార్పాలిన్ షీట్స్ సిద్ధంగా ఉంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవి, ఉప సర్పంచ్ సుమన్, వార్డ్ సభ్యులు గజ్జల స్వామి, ఎర్ర కృష్ణ, సత్తవ్వ, చామంతి, ఎర్ర ప్రభాకర్, నాగరాజు, బండ చంద్రకళ, గ్రామ శాఖ అధ్యక్షులు దుబ్బ దుర్గయ్య, ఎండీ రాజ్ మహమ్మద్, పోతుగంటి శ్రీకాంత్, ఏఈఓ రాజు గారితో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షులు అంజిరెడ్డి, గుర్రం అంజిరెడ్డి, దాస్ అంజన్న, డీసీసీ సభ్యులు ముద్దం లక్ష్మి, ఎల్ల శ్రీనివాస్ రెడ్డి, పంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు



**నారాయణఖేడ్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ఆదేశాల మేరకు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు భోర్గి భీమన్న, నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు అనుముల తుకారం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న ఈ సమ్మె పూర్తిగా న్యాయసమ్మతమని తెలిపారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. కార్మికులకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, పెన్షన్ వంటి కీలక అంశాలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్టీసీ కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించకపోతే, బహుజన సమాజ్ పార్టీ తరఫున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ కాశయ్య రాజు దినేష్ శరణప్ప సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## వడగండ్ల వర్షాలకు పంట నష్టంపై ప్రభుత్వంకు నివేదిక పంపాలి



**సిద్ధిపేట బ్యూరో, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** గురువారం కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వాన లతో జరిగిన పంట నష్టం పై మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేసారు.. అన్నదాతలు ఆందోళన చెందొద్దు అధైర్య పడొద్దని రైతులకు అండగా ఉంటానని భరోసానిచ్చారు.. జరిగిన నష్టం పై జిల్లా కలెక్టర్, జిల్లా మరియు నియోజకవర్గ వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.. సిద్దిపేట అర్బన్ మండలం లో ఎక్కువ నష్టం జరిగిందని తన దృష్టికి వచ్చిందని, సిద్దిపేట నియోజకవర్గం ఎక్కడెక్కడ పంట నష్టం జరిగిందో అయ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో నష్ట పోయిన పంటను పరిశీలించి ప్రభుతత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు. అకాల వర్షాలకు చేతికి వచ్చిన పంట నేల పాలయిందని రైతు లు ఆందోళన లో ఉన్నారని రైతులను అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.ఇప్పటికి ఐదు సార్లు వడగండ్ల వానలకు, ఒక సారి తుఫాన్ తో రైతులకు పంట నష్టం జరిగిందని గుర్తు చేశారు.. మామడి,పండ్ల తోటలు, వరి, మొక్క జొన్న పంటలకు నష్టం జరిగి రైతు లకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.. గతం లో ముగ్గురు మంత్రులు కలసి సిద్దిపేట నియోజకవర్గం లోని ఇబ్రహీంనగర్ గ్రామం లో నష్ట పోయిన పంటను పరిశీలించారు కానీ ప్రభుత్వం నేటికీ ఏ ఒక్క రైతుకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.. అటు రైతు లకు రైతు బందు ఇవ్వక, ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వక, ముగ్గురు మంత్రులు వచ్చి హామీ ఇచ్చిన నేటికి పంట నష్ట పరిహారం చెల్లించక రైతు లకు తీవ్ర అన్యాయం చేస్తుందని, బడ్జెట్ లో పెట్టిన పంటల బీమా ఇవ్వకుండా రైతు లను మోసం చేస్తుందని హరీష్ రావు మండిపడ్డారు. ఈ సందర్భంగా వెంటనే ఆరు విడుతల్లో పంట నష్ట పరిహారం రైతు లకు చెల్లించాలని డిమాండ్ చేసారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**మనూర్, ఏప్రిల్ 14 (జనంసాక్షి) :** పేదల సొంతింటి కళ నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని దోసపల్లి గ్రామ సర్పంచ్ బీరధర్ దత్తు అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మనూరు మండల పరిధి లోని దోసపల్లి గ్రామానికి చెందిన ఇటీవల ఇందిరమ్మ ఇండ్ల మంజూరిలో భాగంగా సింగూర్ ప్రకాష్ నూతన గృహ ప్రవేశానికి బుధవారం ముఖ్యఅతిథిగా పట్లోళ్ళ చంద్రశేఖర్ రెడ్డి విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణఖేడ్ శాసనసభ్యులు పట్లోళ్ళ సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో తమ గ్రామంలో అర్హులందరికీ మొదటి విడత లో భాగంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తున్నామని ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం లో పాల్గొనడం సంతోషకరంగా ఉందని అలాగే తమ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పూర్తి స్థాయిలో నిర్వహించి నిరుపేదలైన లబ్ధిదారుల సొంతింటి కల నెరవేరుస్తామని సర్పంచ్ దత్తు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన అడిషనల్ ఎస్పీ



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాకు అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ కుమార్ సింగ్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు సత్వర సేవలందజేత, పోలీస్ శాఖ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



**తూప్రాన్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయని ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం సందర్భంగా ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజనర్సింహ సర్పంచ్ రామ్ రెడ్డి ఈ రజిత సెక్రటరీ రమేష్ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు గ్రామానికి 41 ఇల్లు మంజూరు కాగా 5 పూర్తయ్యాయని కొన్ని నిర్మాణంలో ఉన్నాయని ఇల్లు రాని వారికి త్వరలో మంజూరు చేస్తామని ఎంపీడీవో చెప్పారు.

# డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు సిద్ధం

- ఈ నెల 26న ఆవిష్కరించనున్న మంత్రి వివేక్, ఎంపీ షెట్కార్



**న్యాల్‌కల్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** భారతరత్న, బాబా సాహెబ్ భీమ్ రావ్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్, మండలం, రామతీర్థం గ్రామంలో ఈ నెల 26, ఆదివారం మధ్యాహ్నం చేపట్టనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి, సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి, విగ్రహ దాత, వివేక్ వెంకటస్వామి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ లు హాజరై అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణను చేపట్టనున్నట్లు స్థానిక గ్రామ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణ అనంతరం ప్రత్యేకంగా సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి, ఎంపీలతో పాటు జహీరాబాద్ ఎమ్మెల్యే కే.మాణిక్ రావు, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ యూనుస్, టిఎస్ఎస్ సిసి డిసి మాజీ చైర్మన్ వై. నరోత్తం, టీఎస్ ఐడీసీ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్, రామతీర్థం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ రచయిత, గాయకుడు రామచందర్ భీమ వంశీ, తెలంగాణ ఉద్యమ నేత గౌని శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎం.రవీందర్, భాజపా మండల పార్టీ అధ్యక్షుడు గంగువార్ మల్లేష్, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ గౌడ్, మాజీ జెడ్పిటీసీలు చంద్రప్ప, స్వప్న భాస్కర్, సహకార సంఘాల మాజీ చైర్మన్లు సిద్ధి లింగయ్య స్వామి, జగన్నాథ్ రెడ్డి, జిల్లా, జహీరాబాద్, మండలంలోని అంబేద్కర్ యువజన సంఘాల దళిత నేతలు, పలువురు ప్రముఖులు, తదితరులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ప్రజానీకం అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె పై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- కార్మికుల సమ్మెకు మద్దతుగా సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో..



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని,సమ్మె పై మొండి వైఖరి వీడాలని,ఈ విషయంలో సమ్మెపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు హనుమకొండలోని కాళోజి సెంటర్ లో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులకు సంబంధించిన సంక్షేమ చేశారు గత ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, అదేవిధంగా ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రెషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆర్టీసి కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్ ఎ స్టాలిన్, వుట్కూరి రాములు, కర్రే లక్ష్మణ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, వేల్పుల సారంగపాణి, గుంటి రాజేందర్, అలువాల రాజు, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మామునూరి దామోదర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో సేవలందించే సైనికులు అంగన్వాడీలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- అంగన్వాడీల సేవలను మరింత పారదర్శకంగా చేసేందుకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ



**మొగుళ్ళపల్లి ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు గ్రామస్థాయిలో సేవలందించే సైనికులని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభివర్ణించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భూపాలపల్లి డివిజన్ అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ ల పంపిణీ కార్యక్రమం, సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో మహిళా శిశు సంక్షేమ శాఖ అందిస్తున్న సేవలు అమోఘమని అభినందించారు. గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్వాడీల సేవలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ప్రతి బిడ్డకు కనీసం ఆరు నెలలు తల్లిపాలు అందేలా చూడాలని, పోషకాహారం తీసుకునేలా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులను చైతన్య పరచాలని సూచించారు. అంగన్వాడీల సేవలను మరింత పారదర్శకంగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే వారికి స్మార్ట్ ఫోన్ లను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ సర్వేల్లో అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది భాగస్వాములవుతూ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు భూపాలపల్లి డివిజన్ లోని 418 మంది అంగన్వాడీ కేంద్రాల సిబ్బందికి స్మార్ట్ ఫోన్ లు అందజేసినట్లు తెలిపారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా పోషణ మాసం నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణీలు, చిన్నారులకు సేవలను అందించడంలో అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ప్రతి చిన్నారి, గర్భిణీ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని, ప్రభుత్వం అందించే పథకాల సమర్థవంతమైన అమలుకు అది దోహదపడుతుందని సూచించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో కూడా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. అనంతరం చిన్నారుల ప్రోగ్రెస్ రిపోర్ట్స్ అందజేశారు. అదేవిధంగా ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల జాబితాను సమర్పించాలని, వాటికి స్థలాలను కేటాయించి..నిధులను మంజూరు చేసి..భవనాల నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా మొగుళ్ళపల్లి మండలంలోని అంగన్వాడీ కేంద్రాల టీచర్లు స్మార్ట్ ఫోన్లను అందుకున్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల సూపర్వైజర్ రజిత వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల టీచర్లు మోటే రజిత, ఎల్లండి వెన్నెల, బత్తిని స్వప్న, బుర్ర అనిత, తక్కళ్లపల్లి అశ్విని, చెవ్వ స్వరూప తదితరులున్నారు.

# పేదింటి మహిళలకు పెద్దన్నగా సీఎం రేవంత్ రెడ్డి

- భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు



**మొగుళ్ళ పల్లి ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** పేదింటి మహిళలకు పెద్దన్నగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నుండి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష 116 చొప్పున రూపాయలను అందజేస్తుందని, దీంతో ఆడబిడ్డలను కన్న తల్లిదండ్రులు అప్పుల పాలు కాకుండా వారి బిడ్డల పెళ్లిళ్లను ఘనంగా నిర్వహించుకుంటున్నారని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండలానికి చెందిన 61 మంది లబ్ధిదారులకు రూ. 61,07,076 లక్షల రూపాయల విలువ గల కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం మండలంలోని ముల్కలపల్లి, మొట్లపల్లి, మెట్టుపల్లి, మొగుళ్లపల్లి, ఇస్సిపేట, రంగాపురం గ్రామాలలో పీఏసీఎస్ మరియు ఐకెపి సెంటర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎండి రఫీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలినేని లింగారావు, మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, ఇస్సిపేట సర్పంచ్ యార ముకుందా రెడ్డి, రంగపురం గ్రామ సర్పంచ్ ఏసు మమత-సంజీవ్, మెట్టుపల్లి గ్రామ సర్పంచ్ మంద సుధాకర్, మొగుళ్ళపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మోటే ధర్మన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమురోజు శ్రీనివాస్, ఎర్రబెల్లి పున్నం చందర్ రావు, క్యాతరాజు రమేష్, పొన్నాల విజేందర్ రెడ్డి, మెరుగు సురేష్ గౌడ్, చర్లపల్లి శ్రీధర్ గౌడ్, మల్సాని రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కల నెరవేరడంతో ఆనందం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 24, (జనం సాక్షి) :**వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా సొంతింటి కల నెరవేరుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగాశుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వివిధ డివిజన్లలోని 256 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, ఏనుగుల మానస రాంప్రసాద్, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నారని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో ఇప్పటివరకు సుమారు 2,000 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 20.80 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా రూ. 42.03 కోట్లు విడుదల చేయడం జరుగుతోందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇండ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎలాంటి దళారి వ్యవస్థ లేకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలు డబ్బులకు ఆశపడి ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, నిరుపేదలకు ఇండ్లు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై కొరడా జలిపించిన ఎస్పీ

- 45 బృందాలతో జిల్లాలో ఆకస్మిక దాడులు
- ప్రామిసరీ నోట్లు, చెక్కులు, పాస్ బుక్కులు, బాండ్ పేపర్స్, సేల్ డేట్స్ స్వాధీనం



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనం సాక్షి);** అమాయక రైతు ల వద్ద నడ్డి విరుస్తూ వారి రక్తాన్ని పిండి పీడిస్తున్న వడ్డీ వ్యాపారులపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా జలుపించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లాలో ఏకకాలంలో 16 మండలాలలో 45 బృందాలచే దాదాపు వందమంది వడ్డీ వ్యాపారులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాలలో దాదాపు 15 కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. వ్యవసాయ భూములు తాకట్టు పెట్టుకుని, వ్యవసాయ భూములు తమ పేర్లపై రాయించుకొని వడ్డీ నిర్వహిస్తున్న వడ్డీ వ్యాపారుల పై జరిపిన దాడులలో వడ్డీ వ్యాపారాల వద్ద నుండి ప్రామిసరీ నోట్లు, బాండ్లు చెక్కుబుక్కులు ఖాళీ పేపర్స్ స్టాంప్ పేపర్స్ సేల్ డేట్స్ లాంటివి స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అక్రమార్కుల ఆటలు కట్టడి చేయడం జరుగుతుందని, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపే దిశగా జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.

# మంచిర్యాలలో ఆర్టీసీ కార్మికుల మౌనదీక్ష




**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** ఆర్టీసీ కార్మికులు ఆవేదనకు లోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దని మంచిర్యాల ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు . రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంచిర్యాల బస్సు డిపో వద్ద నిన్న ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కి కార్మికులు నివాళ్ళు అర్పించి, మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.... ప్రభుత్వం ఆర్టీసి కార్మికుల సమస్యలపై సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే నిన్న శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్నడని, ఈ ఆత్మహత్య ప్రభుత్వం హత్యగా భావిస్తున్నట్టు తెలిపారు. కార్మికులు ఎవరు కూడా ఆందోళనలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సామరస్యంగా మన హక్కులను సాధించుకుందామని అన్నారు. ప్రభుత్వం ప్రయివేటు డ్రైవర్లచే బస్సులు నడిపిస్తుందని, వారు రోడ్లపై ఆక్సిడెంట్లు చేస్తున్నారని, వారి ప్రాణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే మా హామీలను నెరవేర్చాలని లేనిచో రాబోయే రోజుల్లో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ప్రజలకు తెలిసేలా వాస్తవాలను ప్రచురించాలి

- జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** మీడియా సంస్థలు ప్రజలందరికీ వాస్తవాలు తెలిసేలా వార్తలు ప్రచురించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... దినపత్రికలు, న్యూస్ చానళ్లు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని తెలిపారు. 2026-28 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252, ఆర్.టి. 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. సరైన గుర్తింపు, అర్హత లేనివారు పాత్రికేయులుగా చలామణి కావడంతో అసలైన పాత్రికేయులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్రిడిటేషన్ కోసం ఆన్ లైన్ లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల వారిని ఎంపిక చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, డేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, జి.రవితేజ, మంత్రి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

- నిరంతర సాధనతోనే విజయం సాధ్యం
- సంకుచిత భావనలు విడిచి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 24(జనంసాక్షి) :** యువత నైపుణ్యంలో అభివృద్ధి సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోగలరని, నిరంతర సాధనతోనే విజయం సిద్ధిస్తుందని, సంకుచిత భావనలను విస్మరించి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ యువతకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవం లో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ నిర్వహించారు. టాస్క్ సెంటర్, ఐటీడీఏ, డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్, ఉద్యానవన శాఖల ద్వారా యువతకు అందుబాటులో ఉన్న శిక్షణ తరగతులు, ఉపాధి అవకాశాలపై సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. ప్రత్యేకంగా ములుగు జిల్లాలోని యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించేందుకు టాస్క్ సెంటర్‌ను ప్రారంభించామని, దీని ద్వారా యువత ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యం సాధించేలా ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. టాస్క్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి 10 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని, ఇందులో 250 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. యువత సమయాన్ని వృథా చేయకుండా ఏదైనా రంగంలో పనిచేయాలనే ఆసక్తి కలిగి ఉండాలని, ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని తెలిపారు.

# మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్




**శాయంపేట, ఏప్రిల్ 24 ( జనం సాక్షి) :** శాయంపేట మండలం పెద్దకొడేపాక గ్రామానికి చెందిన బోళ్ల మల్లేష్ మహిళకు లిఫ్ట్ ఇస్తానని తన బైక్ ఎక్కించుకొని అసభ్యంగా ప్రవర్తించి ,స్పీడ్ గా బైక్ తిప్పడం వలన కింద పడి చేతికి మరియు తలకి గాయాలు కాగా సదరు మహిళా శాయంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వగా ఎస్సై పరమేశ్వర్ కేసు నమోదు చేసి రిమాండ్ కి పంపడం జరిగిందని తెలిపారు.

# ట్రాక్టర్ కింద పడి ఒక్కరు మృతి



**కాసిపేట ఏప్రిల్ 24( జనం సాక్షి) :** ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఒకరు మృతి చెందారని దేవాపూర్ ఎస్సై గంగారం తెలిపారు. కాసిపేట మండలంలోని మద్దిమాడకు చెందిన కోడప కృష్ణ(36) గురువారం రాత్రి ట్రాక్టర్ ద్వారా ఇసుక తెచ్చేందుకు తోటి కూలీలతో కలిసి గ్రామ శివారు వద్దకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి కృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో తోటి కూలీలు భయాందోళనకు చెంది కృష్ణ మృతదేహాన్ని గ్రామంలోని పాఠశాల వద్ద వదిలేసి వెళ్లారు. ఉదయాన్నే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేయగా ట్రాక్టర్ కింద పడి మృతి చెందారని నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. భార్య కొడప స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవాపూర్ ఎస్సై గంగారం తెలిపారు.

# భీమదేవరపల్లి క్రాస్‌లో ప్రమాదాల పరంపర

- స్పీడ్ బ్రేకర్లే పరిష్కారమంటున్న స్థానికులు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు



**భీమదేవరపల్లి, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** ఒకప్పుడు సాధారణ రహదారిగా ఉన్న భీమదేవరపల్లి క్రాస్... ఇప్పుడు ప్రాణాలకు ముప్పు కలిగించే ప్రమాద కేంద్రంగా మారింది. ముల్కనూర్-హుస్నాబాద్, హుస్నాబాద్-హనుమకొండ ప్రధాన రహదారుల కూడలిగా ఉన్న ఈ ప్రదేశం రోజురోజుకు ప్రమాదాల పరంపరతో రక్తపాతం రహదారిగా మారుతోంది.

ప్రతిరోజూ చిన్నా పెద్దా ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. కొందరు తీవ్రంగా గాయపడుతుండగా, మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. వరుస ఘటనలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. స్థానికుల మాటల్లోనే సమస్య తీవ్రత స్పష్టమవుతోంది. వాహనాలు అధిక వేగంతో దూసుకుపోతున్నాయిముఖ్యంగా రాత్రివేళల్లో పరిస్థితి మరింత భయంకరంగా ఉంటుంది. ఎప్పుడైనా ప్రమాదం జరుగుతుందేమో అన్న భయం వెంటాడుతోంది అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ క్రాస్ వద్ద ఇప్పటికీ సరైన ట్రాఫిక్ సూచికలు,హెచ్చరిక బోర్డులు,స్ట్రీట్ లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తోంది. పలుమార్లు ప్రమాదాలు జరిగినా ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోకపోవడం ప్రజలను కలవరపెడుతోంది.

ఇక్కడే బస్ స్టాప్ ఉండటం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మార్చుతోంది. రోడ్డు దాటి బస్ స్టాప్‌కు వెళ్లాల్సి రావడంతో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వేగంగా దూసుకెళ్తున్న వాహనాల మధ్య రోడ్డు దాటడం ప్రాణాలకు ముప్పుగా మారింది. ఈ నేపథ్యంలో స్థానికులు స్పష్టమైన డిమాండ్లు చేస్తున్నారు. హుస్నాబాద్ వైపు ఒక స్పీడ్ బ్రేకర్, ముల్కనూర్ వైపు మరో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేస్తే వాహనాల వేగం తగ్గి ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని వారు భావిస్తున్నారు. అదనంగా రహదారి వద్ద ప్రతిబింబించే రిఫ్లెక్టర్లు,స్పష్టమైన సూచిక బోర్డులు, సమృద్ధిగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇంకెంతమంది ప్రాణాలు పోతే అధికారులు స్పందిస్తారు?అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భీమదేవరపల్లి క్రాస్ వద్ద తక్షణ చర్యలు తీసుకుని ప్రాణనష్టాన్ని నివారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు వారు హెచ్చరిస్తున్నారు. ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన చర్యలు ఆలస్యం కాకుండా వెంటనే తీసుకోవాలని స్థానికులు మరోసారి డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలంటూ అన్నదాతల ఆందోళన

- ఏవో, పీఏసీఎస్ సిబ్బందిని నిర్బంధించి రైతు వేదిక వద్ద అన్నదాతల ఆగ్రహం



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం ఓ సమస్యగా మారితే... అరకొరగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద రాశులుగా పోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పొంతన లేని సాకులు చెబుతూ నెలరోజులుగా కొనుగోళ్లు చేయకపోవడంతో ప్రకృతి తమపై ఎప్పుడు కన్నెర్ర చేస్తుందో తెలియక రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. తాజాగా శుక్రవారం బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద తమ ధాన్యం కొనుగోలు చేయాలంటూ అక్కడే ఉన్న రైతు వేదిక ఎదుట ఆందోళనకు దిగారు. మండల వ్యవసాయాధికారి శంకర్ తో పాటు పీఏసీఎస్ సీఈవో ప్రసాద్, సొసైటీ సిబ్బంది తిరుపతిరెడ్డి లను రైతువేదికలో ఉంచి రైతులు కొద్దిసేపు నిర్బంధించి బయట తాళాలు వేశారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నెలరోజులుగా రాశులుగా పోసి ఉంచినప్పటికీ ఏదో సాకులు చెప్పి కొనుగోళ్లు చేయడంలేదని... తక్షణమే పంటను కొనుగోలు చేయాలని లేకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటూ ఆవేదన వెల్లిబుచ్చారు. పంట కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులకు టోకెన్లు, స్లిప్పులు ఇచ్చి వేచి చూడండని చెబుతున్నారే తప్ప పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారో మాత్రం చెప్పడంలేదని అన్నదాతలు తమ ఆక్రందన వెల్లిబుచ్చారు. ఇప్పటికే ధాన్యం అమ్ముకోవడానికి నెలరోజులు అలస్యం అయిపోయిందని... నిద్రాహారాలు మాని ధాన్యం రాశుల వద్ద పడిగాపులు పడుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ప్రభుత్వం పంటను కొనుగోలు చేయకుండా నీతులు చెబుతుందని తాత్సారం చేస్తుందని, మధ్య దళారులను ఆశ్రయించి పంటను అమ్ముకుంటే మద్దతు రాక నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని... చేసేది లేక దళారులకి పంటను అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వెలిబుచ్చారు. రైతులు పంట కొనుగోళ్లు ఎందుకు అలస్యం అవుతుందని సొసైటీ సీఈవో ను నిలదీస్తే కొనుగోళ్లకు సంబంధించి కొర్రీలు, పొంతనలేకుండా సమాధానాలు చెబుతున్నారని... తమ అధికారులు చెప్పిన విధంగానే పంటను కొనుగోలు చేస్తామంటూ చెబుతున్నారని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంట కొనుగోళ్లు ప్రారంభించి అలస్యం లేకుండా విక్రయాలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

## నెలరోజులవుతున్నా ధాన్యం కొనుగోలు చేయరా...?

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కోసం మార్కెట్ యార్డుకు తరలించి నెలరోజులవుతుంది. ధాన్యం కొనుగోలు నిర్వాహకులు ఇప్పటికీ పంటను కొనుగోలు చేయలేదు. ధాన్యం రాశులు వద్ద నిద్రాహారాలు మాని రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తుంది. అధికారులు యార్డుకు వచ్చి చూసి పోతున్నారే తప్ప అన్నదాతల పరిస్థితి పట్టించుకోవడంలేదు. ఎండను సైతం లెక్కచేయకుండా పంటను అమ్ముకునేందుకు పనులు మానుకుని మరీ ఎదురుచూడాల్సి వస్తుంది. కొనుగోళ్లు చేయడం చేతకాకపోతే ప్రభుత్వం చేతులెత్తేయాలి... నష్టం అని తెలిసినా దళారులకు అమ్ముకుంటాం కదా... అన్నదాతలను ఇలా ఎందుకు ఇబ్బంది ఎడుతున్నారు. దాళ్వా వడ్లు కొనలేం అని ప్రభుత్వం చెబితే ఇతర పంటను వేసుకునేవాళ్లం కదా... రైతులను ఇలా ఎందుకు ఇబ్బందికి గురిచేస్తున్నారు. తక్షణమే పంటను కొనుగోలు చేయాలి

## కొనుగోళ్లు లేక దళారీలకు అమ్ముకోవాల్సి వస్తుంది

పంట కోసి మార్కెట్ యార్డుడు అమ్మకానికి తీసుకువచ్చి నెలరోజులైంది. ఇంతవరకు కొనుగోళు జరగడంలేదు. ఇదే అదునుగా భావించిన మధ్య దళారీలు రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం అలస్యంగా ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోళ్లు చేయకపోవడం అన్నదాతలను తీవ్రంగా కష్టానికి, నష్టానికి గురిచేస్తుంది. ప్రభుత్వ మద్దతు ధరతో పంట అమ్ముకోడానికి ఇంత జాప్యం ఎందుకు జరుగుతుందో తెలియడంలేదు. కొందరు రైతులు వాతావరణ పరిస్థితుల కారణంగా ఎప్పుడు ప్రకృతి కన్నెర్ర చేస్తుందోనని దళారులకు పంటను అమ్మి ఎంతో కొంత వస్తుందని సరిపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కొనుగోళ్లు ప్రారంభించి అన్నదాతలను కాపాడాలి.

# డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**తాండూరు, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** పాత తాండూర్ ప్రాంతంలో డ్రైనేజి వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.. శుక్రవారం తాండూర్ నియోజకవర్గం లో పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న కాలువల సమస్యలు, మురుగు నీటి నిల్వలు మరియు పారుదల లోపాలను గమనించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. డ్రైనేజి కాలువల శుభ్రత, అడ్డంకులు తొలగింపు, నీటి సాఫీగా పారుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు మరియు ఇంజినీరింగ్ సిబ్బందితో సమావేశమై, డ్రైనేజి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నియమితంగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ వాటర్ పైప్ లైన్ ను పరిశీలించారు. అనంతరం పట్టణము లో మంజురైనా 581 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ను పరిశీలించారు. సిసి రోడ్లు, త్రాగు నీరు, విద్యుత్, అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ తో పాటు ఆర్ డి ఓ అనిత, తహసీల్దార్, డిఇలు సంబంధిత అధికారులు ఉన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పేదల సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యమని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏర్పుమళ్ళ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు నట్టల లక్ష్మి నూతన గృహప్రవేశానికి హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. ఈ మేరకు లబ్ధిదారు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, మాజీ పిఎస్సీ ఎస్ చైర్మన్ జయకృష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అంజిల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, సర్పంచ్ బందెయ్య, ఉపసర్పంచ్ తిరుపతయ్య ,పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు నరసింహనాయుడు, సంతోష్ నాయక్, వార్డు సభ్యులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- వికలాంగులకు స్కూటీల పంపిణీ చేసిన మధుయాష్కి గౌడ్



**హయత్ నగర్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని రాధా మానసిక వికలాంగుల సంస్థలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు వాహనాల (త్రి చక్ర స్కూటీలు) పంపిణీ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి లతో కలిసి హాజరై, ఎల్బీనగర్ నియోజకవర్గం లోని పలువురు లబ్ధిదారులకు వాహనాలను, దివ్యాంగులకు హెల్మెట్లను, శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి ఫోన్ లను అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని, అందులో భాగంగా వికలాంగులకు వాహనాలను అందజేసిందని పేర్కొన్నారు. స్వయం ఉపాధి లో భాగంగా మైనారిటీలకు కుట్టుమిషన్లు, ఈ – స్కూటర్లను ప్రభుత్వం అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంను సమాంతరంగా కొనసాగిస్తున్నదన్నారు. ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం పంపిణీ, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు తదితర పేదల సంక్షేమం కోసం పథకాలను తీసుకువచ్చి అమలు చేస్తుందని వివరించారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మానసిక వికలాంగులైన విద్యార్థులు, లబ్ధిదారులకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు పాత వాహనాలను ఆధునిక మోటార్ సదుపాయాలతో మార్చి అందజేశారు. ఈ పథకం ద్వారా వారి రోజువారీ జీవితం మరింత సులభతరం అవుతుందని వారు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని పలు కార్యక్రమాలు అమలు చేయాలనీ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సదుపాయాలు అందేలా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ రేణుక, డిడిఆర్ సి రమేష్, మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్ గౌడ్, రాగుల వెంకటేశ్వర రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్, సురేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, చెన్న గోని రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు , పన్యాల జయపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, దేవాలయ కమిటీల డైరెక్టర్లు భవాని శంకర్, దిండు ప్రవీణ్ గౌడ్, భీమిడి రామకృష్ణ రెడ్డి, కృపాకర్ రెడ్డి, గణేష్ రెడ్డి, బొగ్గరాపు శరత్, చెరుకు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# కారుపై కరెంట్ పోల్ పడిన ఘటనలో తప్పిన ప్రమాదం



**గరిడేపల్లి, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** గరిడేపల్లి మండల పరిధిలోని కొండాయిగూడెం , పరెడ్డిగూడెం మధ్య రహదారి నిర్మాణం సాంక్షన్ అయినప్పటికీ పూర్తి స్థాయిలో పనులు చేయకుండా కేవలం కంకర పోసి వదిలేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై వాహనాలు తరచుగా స్కిడ్ అవుతూ ప్రమాదాలకు గురవుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం కొండాయిగూడెం కు చెందిన కేతిరెడ్డి వీరారెడ్డి ప్రస్తుతం ఎల్బీనగర్ నివాసం ఒక కుటుంబ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు కంకర రహదారిపై స్కిడ్ అయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కరెంట్ పోల్ విరిగి కారుపై పడింది. అయితే అదృష్టవశాత్తు కారులో ఉన్న వ్యక్తికి ఎలాంటి ప్రాణాపాయం జరగకపోగా కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పనులను పూర్తిచేసి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# జనగణన ఎన్యూమరేటర్ సూపర్వైజర్ల శిక్షణ శిబిరాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**చండూరు, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** జనాభా సర్వే 2027 ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్‌లు, సూపర్వైజర్లకు జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ చండూరు నందు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ పరిశీలించి శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్ లు నియమ నిబంధనలకు అనుకూలంగా పని చేయాలని ఇండ్ల గణనే సమయంలో ఏ ఒక్క ఇంటిని వదిలేయకుండా సర్వే చేయాలని సూచిస్తూ, ఈ ఇండ్ల గణన కార్యక్రమం మే 11. 2026 నుంచి జూన్ 9. 2027 వరకు కొనసాగుతుందని దీనికి ప్రజలందరూ సహకరించి తమ యొక్క వివరాలను నిష్పక్షపాతంగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చండూరు ఆర్డిఓ శ్రీదేవి, తాహాశీల్దార్ రమాకాంత్ శర్మ , ఎంపీడీఓ యాదగిరి, ఎం ఈ ఓ సుధాకర్ రెడ్డి, ఎం పి ఎస్ ఓ నర్సింహ, ఫీల్డ్ లెవల్ ట్రైనర్స్ యం .వెంకటేశ్వర్లు, పి.యాదయ్య పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫామ్, ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలి



**సూర్యాపేట, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** రైతులు తక్కువ నీటి వసతితో అధిక దిగుబడిని ఇచ్చే పంటలను ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్టార్ బాంకెట్ హాల్ లో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసుకోవడం ఎంతో ఉత్తమం అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న కూలీల కొరత, నీటి లభ్యత కారణంగా రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేయాలన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ప్రత్యేక సబ్సిడీలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించే రైతుల కోసం ఎన్ఎంఈఓ ఓపి పథకం కింద మొక్కలు, ఎరువులు, అంతర పంట సాగు బిందు సేద్య పరికరాల ఏర్పాటు కోసం మొదటి నాలుగు సంవత్సరాల కాలంలో 50918 రూపాయలు రాయితీ కింద ఇస్తుందన్నారు. మొక్కల కోసం రైతు తన వాటా కింద ఒక్కో మొక్కకు 20 రూపాయల చొప్పున చెల్లించవలసి ఉంటుందని అన్నారు. బిందు సేద్య పరికరాల ఏర్పాటు కోసం మార్గదర్శకాలను అనుసరించి రైతు తన వాటా చెల్లించాలని అన్నారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్ పంప్ కంపెనీలు నర్సరీ పెంచి రైతులకు మొక్కలు సరఫరా చేసి రైతులకు తగు సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు జిల్లా పరిధిలో ఆయిల్ ఫామ్ మిల్లును ఏర్పాటు చేసి ప్రతినెల ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతుల దగ్గర నుంచి ఆయిల్ ఫామ్ గెలలు కొనుగోలు చేసి 14 రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. తుంగతుర్తి లోని స్వంత వ్యవసాయ క్షేత్రంలో 25 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట మార్కెట్ చేసుకోడానికి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేసుకుందామన్నారు. త్వరలో 15 ఎకరాలలో మామిడి మార్కెట్ ను ఏర్పాటు చేసుకోబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాసం లింగా రెడ్డి, వైస్ చైర్మన్ పంతంగి మల్సూర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, తూముల సురేష్ రావు, ధారవత్ వీరన్న నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి నాగయ్య, ఆయిల్ ఫెడ్ ఇంచార్జి అలీం, కెవికె సీనియర్ హెడ్ డాక్టర్ నరేష్, కెవికె సీనియర్ సైటిష్ట్ నరేష్, ఇఫ్కో మేనేజర్ వెంకటేష్, జేకే పేపర్స్ మేనేజర్ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు అత్యాధునిక పాలిట్రామా కేర్

- రోబోటిక్ ప్రీసిషన్ సర్జరీల ద్వారా పునర్జన్మ
- అసాధ్యం అనుకున్న కేసుల్లోనూ అవయవాల పునరుద్ధరణ
- రోబోటిక్ టెక్నాలజీతో లింబ్ సాల్వేజ్ చికిత్స
- సోమాజిగూడ యశోద హాస్పిటల్ డాక్టర్ కిరణ్ కె రెడ్డి బాదం




**సూర్యాపేట, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాద బాధితులకు అత్యాధునిక పాలి ట్రామా కేర్ , రోబోటిక్ ప్రిసిషన్ సర్జరీ ద్వారా పునర్జన్మ కల్పిస్తున్నట్లు యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ట్రామా, రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్, స్పోర్ట్స్, ఆర్థ్రోస్కోపి, ఇలిజరోవ్, కైఫోస్కోలియోసిస్, ఎండోస్కోపిక్ స్పైనల్ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిరణ్ కె రెడ్డి బాదం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం రోడ్డులో గల జయ భాస్కర్ ఇన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రాణాంతకమైన రోడ్డు ప్రమాదాలు సంఖ్య నానాటికి పెరుగుతుందని అన్నారు. ఇటువంటి ప్రమాదాల్లో బాధితులు పాలి ట్రామా శరీరంలో ఒకేసారి అనేక కీలక అవయవాలకు గాయాలు బారిన పడుతుంటారని, కాళ్లు చేతులు నుజ్జు నుజ్జు అవ్వడం లేదా తీవ్రమైన ఎముకల ఫ్రాక్చర్ల వలన చాలా సందర్భాల్లో అవయవాలను తొలగించాల్సి వస్తుందని అన్నారు. వైద్యరంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుంటూ యశోద హాస్పిటల్ సోమాజిగూడ వారు తమ ఆధునాతన లింబ్ సాల్వేజ్ అండ్ రీ కన్ స్ట్రక్షన్ విభాగం ద్వారా అసాధ్యమనుకున్న కేసుల్లో కూడా అవయవాలను కాపాడే బాధితులకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తునట్లు తెలిపారు. హై ప్రిసిషన్ రోబోటిక్ టెక్నాలజీతో సంక్లిష్టమైన పునర్నిర్మాణ పద్ధతులను ఉపయోగించి గతంలో తొలగించాల్సిందేనని భావించిన అవయవాలను సైతం సోమాజిగూడ యశోద హాస్పిటల్ లో విజయవంతంగా పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యాధునిక రోబోటిక్ అసిస్టెంట్ జాయింట్ రీప్లేస్మెంట్ అందుబాటులోకి వచ్చిందని, ఈ టెక్నాలజీ ద్వారా మోకాలు తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఎండోస్కోపిక్ స్పైనల్ సర్జరీ ద్వారా ఎన్నెముక సమస్యలు డిస్క్ జారడం వంటి సమస్యలకు కీహోల్ పద్ధతిలో చికిత్స అందించడం ద్వారా రోగి కొన్ని గంటల్లోనే నడవగలుగుతారని అన్నారు. వృద్ధులకు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. యశోద హాస్పిటల్ లో ఆర్థోపెడిక్ విభాగంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం అత్యధిక రోబోటిక్స్ సూక్తులు త్రీడీ డయాగ్నస్టిక్స్, శస్త్ర చికిత్స తర్వాత ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ పరమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల సంతాన నిరోధక కేంద్రానికి స్థల పరిశీలన చేసిన కలెక్టర్



**మునుగోడు, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** వీధి కుక్కల సంతాన నిరోధక కేంద్రం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ స్థల పరిశీలన చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మూతపడిన సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించి వీధి కుక్కల సంతానాన్ని నియంత్రించడానికి కేంద్రంగా ఏర్పాటు విషయమై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రించడానికి, రేబిస్ వ్యాధిని అరికట్టడానికి సంతాన నిరోధక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో క్లస్టర్ వారిగా కేంద్రాలను ఏర్పాటు చేసి కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చండూరు ఆర్డీవో వందనపు శ్రీదేవి, ఎంపీడీవో యుగేందర్ రెడ్డి, తహశీల్దార్ నేలపట్ల నరేష్, గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## 'సైబర్‌క్యాబ్' తయారీ షురూ

### ఈ కారుకు నో స్టీరింగ్, నో పెడల్స్!

**వాషింగ్టన్:**ప్రముఖ విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా.. అటానమస్ రోబోట్యాక్సీ సేవల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులోభాగంగా స్టీరింగ్, పెడల్స్ లేని రోబో ట్యాక్సీ సేవల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సైబర్ క్యాబ్' కార్ల ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ కారులో కేవలం రెండే సీట్లు ఉంటాయి. దీనికి సంబంధించి 38 సెకన్ల ప్రమోషనల్ వీడియోను కంపెనీ సీఈఓ ఎలాన్ మస్క్ పోస్ట్ చేశారు. ఈ వీడియోలో డ్రైవర్‌లెస్ సైబర్‌క్యాబ్ ఎలా పనిచేస్తుందో వివరించారు. ఫ్యాక్టరీ నుంచి రోడ్డు పైకి వచ్చిన క్యాబ్.. డ్రైవర్ అవసరం లేకుండా దానంతట అదే పరుగులు పెట్టడం చూపించారు. గిగా టెక్సాస్‌లో ఈ సైబర్‌క్యాబ్ ఉత్పత్తిని చేపడుతున్నారు. టెస్లా తన వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. టెస్లా రోబోట్యాక్సీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రైడ్‌ను బుక్ చేస్తే ఇంటి ముందుకువచ్చి ఆగుతుంది. అందులో ఎక్కగానే గమ్యస్థానానికి చేరుస్తుంది. ఇందులో డ్రైవర్ అవసరం ఉండదు.

# రూ.4 లక్షల కోట్లు ఆవిరి

### • భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అమెరికా- ఇరాన్ మధ్య చర్చలపై అనిశ్చితి, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు గరిష్ఠ స్థాయి వద్ద కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రూపాయి క్షీణత, ఎఫ్ఐఐల విక్రయాలు దేశీయ సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో బెంచ్‌మార్క్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లకు పైగా పతనం కాగా.. నిఫ్టీ 24 వేల పాయింట్ల దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4 లక్షల కోట్లు క్షీణించి రూ.461 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,483.80 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,664) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 76,403.87 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరికి 982.71 పాయింట్ల నష్టంతో 76,681.29 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 275.10 పాయింట్ల నష్టంతో 23,879.95 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.25గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107.12 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4681 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**అంచనాలు సవరించిన జేపీ మోర్గాన్**

ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జేపీ మోర్గాన్ భారత స్టాక్ మార్కెట్ రేటింగ్‌ను 'ఓవర్ వెయిట్' నుంచి 'న్యూట్రల్'కు తగ్గించింది. మార్కెట్‌లో పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బేరిష్ ట్రెండ్ కొనసాగితే నిఫ్టీ-50 20,500 పాయింట్లకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రస్తుత స్థాయిల నుంచి సుమారు 15 శాతం క్షీణించొచ్చని పేర్కొంది. సానుకూలతలు ఉంటే 30 వేల పాయింట్లకు చేరుకోవచ్చని పేర్కొంది. గతంలో బుల్ ట్రెండ్ 33 వేలు ఉండగా.. బేస్ 30వేలు, బేరిష్ 24వేలు పాయింట్లుగా ఉండొచ్చని జేపీ మోర్గాన్ అంచనా వేసింది.



## పెరగనున్న వొడాఫోన్ ఐడియా మొబైల్ టారిఫ్‌లు

దిల్లీ: ప్రైవేటు టెలికాం ఆపరేటర్ వొడాఫోన్ ఐడియా మొబైల్ టారిఫ్‌లను పెంచనుంది. ఈ పెంపు స్వల్ప మొత్తంలోనే ఉండబోతోందని, పెద్ద మొత్తంలో అయితే ఉండదని స్పష్టంచేసింది. ఇటీవల భారతీ ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ రీఛార్జి ప్లాన్ ధరను 4-5 శాతం మేర పెంచింది. దీంతో టెలికాం కంపెనీలు ఈ ఏడాది 15 శాతం మేర ఛార్జీలు పెంచే అవకాశం ఉందని అనలిస్టులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెల్యులార్ ఆపరేటర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన డిజికామ్ సమ్మిట్‌లో వొడాఫోన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అభిజిత్ కిశోర్ పాల్గొన్న సందర్భంగా స్వల్ప మొత్తంలో ఛార్జీల పెంపు అంశంపై మాట్లాడారు. కంపెనీ పనితీరు ప్రస్తుతం మెరుగవుతోందన్నారు. ఫిబ్రవరి, మార్చిలో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరుగుతోందన్నారు. కంపెనీలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందన్న ఆయన.. పనితీరుపై నమ్మకంగా ఉందని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా భారీగా సబ్‌స్క్రైబర్ల సంఖ్య కోల్పోయిన వొడాఫోన్ ఐడియా.. మార్చి నెలలో లక్ష మంది కొత్త సబ్‌స్క్రైబర్లను చేర్చుకున్నట్లు ట్రాయ్ తాజా నివేదికలో పేర్కొంది.

## ప్రపంచానికి మైథోస్ భయాలు




### ఆంథ్రోపిక్ కొత్త ఏఐ మోడల్ ప్రకంపనలు!

**న్యూఢిల్లీ:**రిలీజ్‌కాని ఓ ఏఐ మోడల్ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. ప్రపంచ బ్యాంకింగ్, ఫైనాన్స్ వ్యవస్థలను భయపెడుతోంది. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ నుంచి ఇండియా వరకు అత్యున్నత స్థాయి వ్యక్తులు ఉరుకుల పరుగుల మీద అత్యున్నత సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆ ఏఐ మోడల్ పేరే ఆంథ్రోపిక్‌కు చెందిన క్లాడ్ మైథోస్. ఇంతకీ దీనిపై ఎందుకీ ఆందోళన?..

సాధారణంగా మనుషులు కొన్ని గంటలు వెచ్చించి చేసే పనులను ఇప్పుడొస్తున్న అత్యాధునిక ఏఐ మోడళ్లు క్షణాల్లో చేసిపెడుతున్నాయి. ఇలా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ వ్యవస్థలో లోపాలను కనిపెట్టేందుకు రూపుదిద్దుకున్న ఏఐ మోడల్ ఆంథ్రోపిక్ మైథోస్. సైబర్ సెక్యూరిటీలోని లోపాలను గుర్తించడంతో పాటు దానికి పరిష్కార మార్గాలను కూడా చూపుతుంది. కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్, బ్రౌజర్‌లలో దశాబ్దాల కాలంగా ఉన్న లోపాలను కూడా కనిపెట్టగలదని నిరూపితమైంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. మరి ఈ ఆయుధం నేరగాళ్ల చేతికి చిక్కితే? సరిగ్గా ఈ ప్రశ్నే ఇప్పుడు అటు బ్యాంకింగ్ రంగాన్ని, టెక్నాలజీ సంస్థలను కలవరపాటుకు గురిచేస్తోంది. బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు చాలా వరకు ఇంటర్ కనెక్టెడ్‌గా ఉంటాయి. ఇవి ఐటీ సిస్టమ్‌లపై ఆధారపడి ఉంటాయి. ఒకవేళ ఒక బ్యాంక్‌లో సైబర్ దాడి జరిగితే.. అది ప్రపంచవ్యాప్తంగా ఇతర సంస్థలతో అనుసంధానం అయ్యి ఉంటుంది కాబట్టి, వాటిపైనా ప్రభావం పడుతుంది. పేమెంట్లు, ఫారెక్స్ ట్రేడింగ్, మనీ మార్కెట్, స్టాక్ మార్కెట్, డిపాజిటరీలు, పేమెంట్ గేట్‌వేలు.. ఇలా అన్నీ ప్రభావితమవుతాయి.

**విడుదల కాకపోయినా..**

వాస్తవానికి ఈ ఏఐ మోడల్‌ను పబ్లిక్‌గా ఇంకా రిలీజ్ చేయలేదు. ప్రాజెక్ట్ గ్లాస్ వింగ్‌లో భాగంగా యాపిల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్ వంటి 12 ప్రధాన టెక్ కంపెనీలు దీన్ని పరీక్షించాయి. ఇందులో భాగంగా చేపట్టిన టాస్కుల్లో మనుషుల కంటే సైబర్ సెక్యూరిటీ విషయంలో మెరుగైన పనితీరును కనబరచడంతో పాటు హ్యాకింగ్ టాస్కులను చేపట్టడం గమనార్హం. దీంతో పబ్లిక్ విడుదలను నిలిపివేశారు. అయితే, ఈ 12 కంపెనీలే కాక అనధికారిక యాక్సెస్ జరిగిందన్న రిపోర్టులూ బయటకొచ్చాయి. దీంతో మరిన్ని భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విషయాన్ని కంపెనీ కూడా ధ్రువీకరించింది.



**ఉన్నత స్థాయి సమావేశాలు**

ఏఐ మోడల్ ప్రభావాన్ని అంచనా వేయడానికి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ ఈ నెల మొదట్లో అత్యవసరంగా సమావేశమయ్యాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, ఐఎంఎఫ్ చీఫ్ మైథోస్ పట్ల ఆందోళన వ్యక్తంచేశాయి. భారత్‌లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఏఐ మోడల్స్ వల్ల కలిగే ముప్పు, డేటా సెక్యూరిటీపై దాని ప్రభావం చర్చించేందుకు బ్యాంకింగ్ రంగంలోని ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. బ్యాంకులు తమ ఐటీ సిస్టమ్‌లను బలోపేతం చేసుకోవాలని, వినియోగదారుల డేటాను రక్షించాలని బ్యాంకులకు ఆర్థిక మంత్రి సూచించారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |


**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,42,800 | ₹ 1,55,780 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,80,000

# డేటా తీగ తెగుతుంది..

## ఇరాన్ హెచ్చరికలు



**వాషింగ్టన్:**అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ.. పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడు ఏ రూపంలోకి మారుతుందో తెలియని ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సీజ్‌ఫైర్ సమయంలో కూడా అమెరికా హర్మూజ్ (నాబితీజీతిబి నీట ఊనీతీఎబీళి)ను దిగ్బంధించడంపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. ఈ జలసంధిలో కేబుళ్లు తెగొచ్చని ఐఆర్‌జీసీకి అనుబంధంగా పనిచేసే తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ సంకేతాలు ఇచ్చింది. "ప్రమాదాల వల్ల గానీ, ఉద్దేశపూర్వకంగా గానీ వీటికి ఏమైనా నష్టం వాటిల్లితే.. పర్షియన్ గల్ఫ్ అంతటా తీవ్ర అంతరాయం కలగొచ్చు" అని ఆ మీడియా కథనం పేర్కొంది హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకం. అంతేకాదు.. అది డిజిటల్ మౌలిక సదుపాయాలకు కూడా అంతే కీలకమని తస్నీమ్ తన కథనంలో రాసుకొచ్చింది. బ్యాకింగ్, క్లౌడ్ సర్వీస్, కమ్యూనికేషన్లకు ప్రధానమైన ఫాల్కన్, ఏఏఈ-1, టీజీఎన్-గల్ఫ్, ఎస్ఈఏ-ఎంఈ-డబ్ల్యూఈ వంటి భూగర్భ కేబుల్ వ్యవస్థలు హర్మూజ్ నుంచే వెళుతున్నాయి. ఈ కేబుళ్లన్నీ ఇరుకైన మార్గంలో కుప్పపడినట్టుగా ఉండటం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే నష్ట తీవ్ర ఎక్కువగా ఉంటుంది. ఇరాన్ కంటే యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియా పైనే ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆ కథనం పేర్కొంది. అయితే ఇవన్నీ నోటిమాట బెదిరింపులేమీ కాదు. ప్రాంతీయ ఘర్షణల కారణంగా 2024, 2025లో ఎర్రసముద్రంలోని పలు భూగర్భ కేబుళ్లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతానికి వెళ్లడానికి ప్రవేశం పరిమితంగా ఉండటంతో వాటిని మరమ్మతు చేయడానికి అప్పట్లో కొన్ని నెలల సమయం పట్టింది. యుద్ధం తీవ్రరూపం దాలిస్తే హర్మూజ్‌లో ఇరాన్.. ఎర్ర సముద్రం దక్షిణ ముఖద్వారం బాబ్ అల్ మందేబ్ జలసంధిలో ఉన్న సముద్రగర్భ కేబుళ్లను హూతీలు టార్గెట్ చేస్తారా..? అన్న అనుమానాలు ఇప్పటికే ఉన్నాయి. ప్రస్తుతం తస్నీమ్ కథనం ప్రకారం.. ఆర్థిక, కమ్యూనికేషన్ ప్రభావం ఎక్కువగా పడే కేబుల్ మార్గాలు, ల్యాండింగ్ స్టేషన్లు, డేటా హబ్‌లను ఇరాన్ హైలైట్ చేస్తోంది. గల్ఫ్ దేశాల్లో ముఖ్యంగా యూఏఈ, బహ్రెయిన్‌లో క్లౌడ్, డేటా సెంటర్ మౌలిక సదుపాయాలు ఒకేచోట కేంద్రీకృతమై ఉన్నాయి. ఇప్పటికే యూఏఈ, బహ్రెయిన్‌లోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ అనుసంధానమైన సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ డ్రోన్ దాడులు జరిపినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రమాద తీవ్రత గురించి బయటకు రానప్పటికీ.. యుద్ధం ఇలాగే కొనసాగితే ఇరాన్ వాటిని మరోసారి టార్గెట్ చేస్తుందా..? అన్న భయాలు నెలకొన్నాయి. కేబుళ్లకు ఏమాత్రం కోత పడినా ఆర్థిక వ్యవస్థలు మందగించవచ్చు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లకు అంతరాయం కలగవచ్చు. దెబ్బతిన్న కేబుళ్లను సరిచేసేందుకు ప్రత్యేక నౌకలు ఆ జలసంధి వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల వేళ అలా వెళ్లడం కూడా అసాధ్యమే.



## ఇరాన్ చాబహార్ పోర్ట్‌లో.. వాటాలు విక్రయించనున్న భారత్?

టెహ్రాన్:ఇరాన్‌లోని చాబహార్ పోర్టు ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకొన్నాయి దాదాపు పదేళ్లు కావొస్తున్నా మౌలిక సదుపాయాల కల్పన పనులు ఓ కొలిక్కి రాలేదు. టెహ్రాన్‌పై అమెరికా ఆంక్షలతో భారత్ ఆ ప్రాజెక్టునే వదిలించుకోవాలనుకుంటుదనే వార్తలు వస్తున్నాయి. చాబహార్ పోర్టు ప్రాజెక్ట్‌ను ఇరాన్ సంస్థకు విక్రయించేందుకు సిద్ధమవుతోందని ఆంగ్ల మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. ఈ పోర్ట్‌కు సంబంధించి అగ్రరాజ్యం ఇచ్చిన మినహాయింపులు ఈ ఏడాది 2026 ఏప్రిల్ 26తో ముగియనున్న నేపథ్యంలో ఈ కథనాలు వచ్చాయి. ఇండియా పోర్ట్స్ గ్లోబల్ చాబహార్ ఫ్రీజోన్‌లో ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ కు ఉన్న వాటాను తిరిగి ఇరాన్ సంస్థకే విక్రయించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఇరాన్ దక్షిణ తీరంలోని చాబహార్ నౌకాశ్రయం అభివృద్ధి ప్రాజెక్టులో భారత్ ప్రధాన భాగస్వామి. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం జరిపేందుకు ఈ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో మన దేశానిదే కీలక పాత్ర. ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టింది. దీనికి సంబంధించి భారత్- ఇరాన్‌ల మధ్య 2016లోనే ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ట్రంప్ ఆంక్షల కత్తి వేలాడుతున్న నేపథ్యంలో చాబహార్ పోర్టు ప్రాజెక్టులో తన భాగస్వామ్యంపై భారత్ వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఈ ప్రాజెక్టులో తన ప్రత్యక్ష ప్రమేయాన్ని ముగించే దిశగా..ఈ ప్రాజెక్టులో తన ప్రత్యక్ష ప్రమేయాన్ని ముగించే దిశగా.. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం దాదాపు 120 మిలియన్ డాలర్లను బదిలీ చేసే ప్రక్రియలో ఉందని ఆ వార్తల సారాంశం. ఈ ప్రాజెక్టు నుంచి భారత్ వైదొలగాలని చూస్తోందనే కథనాలపై గతంలోనే విదేశాంగశాఖ కూడా స్పందించింది. దీనిపై అమెరికాతో సంప్రదింపులు జరుగుతున్నాయని వెల్లడించింది. మరిప్పుడు అమెరికా మినహాయింపులు రెండు రోజుల్లో ముగియనున్నాయి. ప్రస్తుతం ఇరాన్‌తో యుద్ధంలో నిమగ్నమైన అమెరికా ఆ మినహాయింపులను పొడిగిస్తుందా..? అన్నది అనుమానమే.

## భారీ ఓటింగ్ బీజేపీ అధికారానికి సూచిక

అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహాటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

## పాక్‌కు ఇరాన్ మంత్రి అరాగ్చీ..!

మంత్రి ఇషాక్ దార్, పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాంతీయ పరిణామాలు, కాల్పుల విరమణ సంబంధిత అంశాలపై వారు మాట్లాడుకున్నారని ఇరాన్ స్థానిక మీడియా కథనం వెల్లడించింది. ఇవన్నీ చూస్తుంటే.. మలివిడత చర్చలు ఉంటాయనే అంచనాలు వెలువడుతున్నాయి.

## మొజ్తాబా ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ..?



టెహ్రాన్:ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యానికి సంబంధించి తాజాగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఖమేనీ కాలికి గాయం కావడంతో పాటు ఆయన ముఖం కూడా కాలిపోయినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనకు ప్లాస్టిక్ సర్జరీ చేసే అవకాశాలున్నట్లు ఇరాన్ సీనియర్ అధికారులను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 'ఖమేనీ బతికే ఉన్నారు. స్పృహలోనే చురుకుగా ఉన్నారు. అయితే, దాడుల్లో కాలికి గాయం కావడంతో దానికి మూడుసార్లు ఆపరేషన్ జరిగింది. కృత్రిమ కాలు అమర్చే అవకాశాలు ఉన్నాయి. ఆయన చేతికి కూడా శస్త్రచికిత్స జరగ్గా.. ఇప్పుడు దాని పరిస్థితి మెరుగుపడింది. దాడుల్లో ఖమేనీ ముఖం, పెదవులు కూడా తీవ్రంగా కాలిపోవడంతో.. ఆయన మాట్లాడటం కూడా కష్టంగా ఉంది. ఈ క్రమంలోనే ఆయనకు ప్లాస్టిక్ సర్జరీ చేసే అవకాశాలు ఉన్నాయి' అని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఇక, ఉద్రిక్తతల నేపథ్యంలో ఖమేనీని రహస్య ప్రాంతంలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు కూడా ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆయనకు ఏదైనా సమాచారం చేరవేసేందుకు.. చేతితో రాసిన ఉత్తరాలను మాత్రమే వాడుతున్నారని అవి తెలిపాయి. ఆ ఉత్తరాలను ఖమేనీ ఉన్న రహస్య ప్రాంతానికి మోటార్‌సైకిళ్లపై చేరవేస్తున్నట్లు వెల్లడించాయి. ఆయన సమాధానాలు అలాగే తిరిగి వస్తున్నాయని పేర్కొన్నాయి. కాగా.. ఇజ్రాయెల్ నిఘాకు దొరకకుండా ఉండటం కోసం.. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు కూడా ఖమేనీని కలిసేందుకు వెళ్లడం లేదని తెలుస్తోంది.

**బోర్డు సభ్యుల సాయంతో నిర్ణయాలు..**

దేశాన్ని నడిపేందుకు మొజ్తాబా ఓ బోర్డును ఏర్పాటుచేసినట్లు ఇరాన్ మాజీ అధ్యక్షుడు అహ్మదీనేజాద్‌కు సన్నిహితుడైన రాజకీయవేత్త అబ్దుల్‌రెజా దవారీ పేర్కొన్నారు. ఈ బోర్డుకి ఖమేనీ డైరెక్టర్‌గా ఉండగా.. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ జనరల్స్ సభ్యులుగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు. వారి సలహాలు, మార్గదర్శకాల పైనే ఖమేనీ ఎక్కువగా ఆధారపడుతున్నారని తెలిపారు. యుద్ధం, దౌత్య ప్రయత్నాలు, జాతీయ భద్రత విషయాల్లో వారు సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

## సమయం మించిపోతోంది త్వరగా ఒప్పందానికి రండి

ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్‌కు సమయం మించిపోతోందని హెచ్చరిస్తూ ట్రంప్ ట్రూత్‌సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'నాకు చాలా సమయం ఉంది. కానీ ఇరాన్‌కు లేదు. సమయం మించిపోతోంది. ఇరాన్ సైన్యం కుప్పకూలిపోయింది. వారి నాయకులు ఇక మనతో లేరు. దిగ్బంధనం పటిష్టంగా ఉంది. ఇకనుంచి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది' అని ఆయన ట్రూత్‌లో రాసుకొచ్చారు.

**టాప్ సీక్రెట్..**

ఇటీవల ఇరాన్ పతాకం ఉన్న ఓ వాణిజ్య నౌకను అమెరికా సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ నౌకలో చైనా నుంచి ఇరాన్‌కు వెళుతున్న బహుమతి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఆ బహుమతి ఏంటనే విషయాన్ని వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. అది అత్యంత రహస్యమైనదని పేర్కొన్నారు. ఇరాన్ నౌకలపై విధించిన దిగ్బంధనాన్ని అద్భుతమని కొనియాడారు. గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకోవడం, హర్మూజ్ జలసంధిలో సీ మైన్స్ పెట్టి ఇరాన్ పెద్ద తప్పు చేసిందన్నారు.

**ఇజ్రాయెల్- లెబనాన్ కాల్పుల విరమణ పొడిగింపు**

ఇజ్రాయెల్- లెబనాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణను మరో మూడు వారాలు పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ క్రమంలో ఇరుదేశాల నాయకులు త్వరలో వైట్‌హౌస్‌లో సమావేశమయ్యే అవకాశం ఉందని కూడా తెలిపారు.

## ఆప్‌పై భాజపా భారీ వల

సరైన పార్టీలో ఉన్న భావన నాలో లేదు. అందుకే ఆప్‌నకు దూరమై, ప్రజలకు దగ్గరవుతున్నానని ప్రకటిస్తున్నాను""నేను పార్టీ కార్యకలాపాలకు దూరం జరగడానికి గల కారణం ఇప్పుడు చెబుతున్నాను. నేను వారి నేరాల్లో భాగం కావాలని అనుకోవడం లేదు. భాగం కాలేదు కాబట్టి.. వారి స్నేహాన్ని పొందలేకపోయాను. మా ముందు రెండే దారులు కనిపించాయి. అయితే రాజకీయాల నుంచి దూరం జరగాలి. లేకపోతే మా అనుభవాన్ని ఉపయోగించి సానుకూల రాజకీయాలు చేయాలి. అందుకే భాజపాలో చేరాలని నిర్ణయించుకున్నాం " అని చడ్డా అన్నారు. ఆయనతో పాటు స్వాతి మాలీవాల్, హర్భజన్ సింగ్, సందీప్ పాఠక్, అశోక్ మిత్తల్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ భాజపాలో చేరనున్నారు. "రాజ్యసభలో ఆప్ బలం 10. ఏడుగురం కలిసి ఉన్నాం. ఈ ఉదయం సంతకాలు చేసిన లేఖలను రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించాం" అని చడ్డా వెల్లడించారు.

**భాజపా మళ్లీ 'ఆపరేషన్ లోటస్'ను ప్రారంభించింది**

ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చడ్డా ఆ పార్టీకి రాజీనామా చేసి, భాజపాలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. భాజపా తన చర్యలతో మరోసారి పంజాబీలను గట్టి దెబ్బ కొట్టిందని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఆ పార్టీ ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలుపెట్టిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. తమ ఏడుగురు ఎంపీలను ప్రలోభపెట్టడానికి భాజపా ఈడీ, సీబీఐలను వాడుకుందని ఆరోపించారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు న్యాయబద్ధమైనవే..

- సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సంపూర్ణ మద్దతు
- జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ దొంత నరేందర్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** ఏ రకంగా చూసినా ఆర్టీసీ ఉద్యోగుల ప్రస్తుత డిమాండ్లు న్యాయబద్ధమైనవే. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ కూడా హామీ ఇచ్చిందని, తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులు చేపట్టిన సమ్మెకు సమస్యలు పరిష్కారమయ్యే వరకు సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని మెదక్ జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ దొంత నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ జేఏసీ నాయకులు ఎంఆర్కే రావు ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన స్థానిక గుల్షన్ క్లబ్ నుండి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి గురువారం నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ లో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటాన్ని శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసి వారికి నివాళులు అర్పించే క్రమంలో టిఎన్జిఓ నాయకులతోపాటు జేఏసీ భాగస్వామ్య సంఘ నాయకులు విట్టల్, రాజ్ కుమార్, సతీష్ రావు, రాజగోపాల్ గౌడ్, శివయ్య, శ్రీహరి గౌడ్, ప్రసాద్, మెప్మా సునీత, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శంకర్ గౌడ్ అమర్ హై అంటూ నినాదాలు చేసి వారికి కొవ్వొత్తులతో పూలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికై ఎన్నో దఫాలుగా యాజమాన్యానికి ప్రభుత్వానికి విన్నవించారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి సరైన గౌరవం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని తెలిపారు. వారు ఎండనక వాననక రాత్రనక పగలనక విధినిర్వహణలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా రోడ్డు రవాణా సంస్థను కాపాడుకునేందుకు వారు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని కార్మికుల సేవలను గుర్తు చేశారు. 2021 నుండి వేతన సవరణ అనేది విధానాల్లో ఉన్నదే. కార్మిక సంఘాల పునరుద్ధరణ ఉద్యోగుల హక్కు. ఆర్టీసీ ఉద్యోగుల హక్కులను ఆర్థిక భారం అని ఆలోచించకుండా ప్రభుత్వం సానుభూతితో పరిష్కరించవలసిన అవసరం ఉంది. ప్రజా రవాణాను ఆర్థిక అంశాలతో పోల్చోద్దని ప్రభుత్వం ఏ విధమైన పాలసీలు ప్రవేశపెట్టిన వాటిని విధిగా పాటిస్తూ ప్రజా రవాణా చేస్తున్నారని, మహాలక్ష్మి పథకం క్రింద మహిళలను గౌరవిస్తూ ఉచిత రవాణాలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రధానంగా మహిళ కండక్టర్లకు బస్సు పూర్తిగా నిండిన ప్రయాణికుల ఒత్తిడితో సతమతమవుతున్నప్పటికీ విధి నిర్వహణ బాధ్యతతో నిర్వర్తిస్తున్నారని అన్నారు. కార్మికులు ఎవ్వరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని మీరు చేస్తున్న ఉద్యమానికి అన్ని వర్గాల ఉద్యోగుల అండ సంపూర్ణంగా ఉంటుందని తెలియజేశారు. శంకర్ గౌడ్ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి వారితో చర్చలు జరిపి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు ఫణి రాజ్, ఫజాలుద్దీన్, రఘునాథ్ రావు, లీల, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, కిరణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సలావుద్దీన్, ఏడుపాయల వనదుర్గ యూనిట్ కార్యదర్శి ప్రశాంత్, మున్సిపల్ ఫోరం కార్యదర్శి శ్రీపాల్ రెడ్డి, మెదక్ యూనిట్ ఉపాధ్యక్షులు సలీం, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి రిజ్వానలి, తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు




**దోమ, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను వదిలి కుట్రలు పన్నీతే కోర్ట్ తీర్పు తో ఇక నైనా వక్ర బుద్దులు మాను కొని ప్రజల క్షేమం కోసం ఆలోచించాలి అని సీఎం రేవంత్ రెడ్డి తో పాటు వారి మంత్రి వర్గానికి చూయించారు. దోమ మండల బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచుల సంగం అధ్యక్షులు కె రాజిరెడ్డి,మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య,పార్టీ మండల శాఖ అధ్యక్షులు గోపాల్ గౌడ్, లు కాళేశ్వరం అవినీతి పై పీసీ ఘోష్ కమిషన్ పట్ల మాజీ సీఎం కెసిఆర్ మాజీ మంత్రి హరీష్ రావు ఇతర అధికారుల పై ఏర్పాటు చేసిన కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకునే వీలు లేదని హై కోర్ట్ తీర్పు ఇవ్వడం పట్ల వారు సంతోశం వ్యక్త పరిచి దోమ లో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రజలు ఇచ్చిన తీర్పును అవువృద్ధి పై చూపి ఎలాంటి కక్ష లు లేని పాలన చేయాలనీ మండలాల్లో కూడా పోలీస్ ల తో పాటు పలు శాఖల అధికారులు ఏక పక్ష ధోరణి అవలంబిస్తున్నారు. వారిని వదిలి పెట్టం అని బీఆర్ ఎస్ నేతలు అన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరు పై ప్రజల్లో అగ్రహావేశాలు కనబడుతున్నాయి. రానున్నది బీఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వం అని రైతుల పట్ల కెసిఆర్ కు ఉన్న అవిమానమే కోర్ట్ తీర్పు ద్వారా వెలువడింది.అని నేతలు అన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు మైనొద్దీన్ శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## అగ్రి డ్రోన్ల ద్వారా వేగవంతమైన, సురక్షితమైన పిచికారీ

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించి అగ్రి డ్రోన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో ఎల్మకన్య పిఎసిఎస్ ద్వారా అగ్రి డ్రోన్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించి అగ్రి డ్రోన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు ఈ సేవలు అందుబాటులోకి రావడం వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతుల అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటిన ఎమ్మెల్యే బీఎంఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



**శామీర్‌పేట, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శామీర్ పేట తహసిల్దార్ సుచరిత హెచ్చ రించారు. శుక్రవారం శామీర్ పేట మండలం బొమ్మ రాశిపేట లోని ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఆ భూమికి త్వరలోనే ఫెన్సింగ్ వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడు తూ..ఆక్రమణకు గురి చేస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. బొమ్మరాశి పేట గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములైన సర్వే నంబర్ 416/2 - విస్తీర్ణం 10 ఎకరాల12 గుంటలు, సర్వే నంబర్ 417/2 - విస్తీర్ణం 3 ఎకరాల13 గుంటలు, 429/2 - విస్తీర్ణం 3 ఎకరాల 36 గుంటల భూమిని గుర్తించినట్లు తెలిపారు. భూమికి త్వరలోనే ఫెన్సింగ్ వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ భూములపై అక్రమంగా ఆక్రమణలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాఘవ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు



**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** పెద్ద శంకరంపేట పట్టణంలోని శ్రీ గోదా సహిత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి వార్షిక ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆలయంలో హోమం పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈనెల 25న శనివారం వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ విగ్రహం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని అరటి కొబ్బరి మట్టలతో పాటు వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు మహేష్ శర్మ రామన్న పంతులు. గంగాధర్ గౌడ్ భూమేశ్వర్ గౌడ్ రాజన్ గౌడ్ చేనేత సహకార సంస్థ మాజీ చైర్మన్ కృష్ణమూర్తి. అధిక సంఖ్యలో మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కేసులో న్యాయమే గెలిచింది



**రాయికోడు, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** కాళేశ్వరం కేసులో న్యాయమే గెలిచిందనీ, హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ కు చెంపపెట్టు అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చేవెళ్ల విట్టల్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రమైన రాయికోడ్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ తీర్పుతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు అడ్డుకట్ట పడిందని అన్నారు. అంతిమంగా న్యాయం గెలిచిందని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించ లేదని హైకోర్టు స్పష్టం చేయడం ద్వారా ఈ నివేదనకు చట్టబద్ధత లేదని తేలిపోయిందన్నారు. హైకోర్టు ఆదేశించడంతో బిఆర్ఎస్ నైతిక విజయాన్ని చాటుతోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు లను రాజకీయంగా వేదించాలనే కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ అడ్డం పెట్టుకుందని అన్నారు. ప్రాజెక్టు ప్రతిష్టను దెబ్బతీయాలని కాంగ్రెస్, బిజెపి పార్టీలో కుట్రపన్నిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మత్తులను సకాలంలో చేయకుండా రెండేళ్లు కాలయాపన చేసిన ప్రభుత్వం ఇప్పుడు గత్యంతరం లేక పనులు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం వల్లనే భూగర్భ జలాలు పెరిగాయి అన్నారు. రైతులు రెండు పంటలు పండిస్తున్నారని వరి పండించడంలో దేశంలోని మొదటి స్థానం తెలంగాణ రాష్ట్రంకె దక్కిందన్నారు. తెలంగాణలోని గ్రామాలలోని ప్రజలు వలసలు ఆపింది కాళేశ్వరం ప్రాజెక్టు ఏ నని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, మాజి కో ఆప్షన్ మెంబర్ అబెద్ అలీ, మాజీ వరం వైస్ చైర్మన్ తుకారం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారుతి, ఆయా గ్రామ సర్పంచ్ లు బసవరాజ్, నిరంజన్, విష్ణువర్ధన్ రెడ్డి ,నరేష్, ఏసు, మొగులయ్య, మారుతి, యువత నాయకులు అంజి, నాయకులు అశోక్, సంగమేశ్వర్, మల్లేష్, శంకర్, మైపాల్ రెడ్డి, కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సేవల్లో సాంకేతిక విప్లవం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం ద్వారా సేవల్లో వేగం పెరుగుతుందన్నారు.గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఈ స్మార్ట్ ఫోన్ ద్వారా మరింత పారదర్శకంగా, ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేసే వీలుంటుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా అంగన్వాడీ టీచర్లు తమ బాధ్యతలను మరింత సమర్ధవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది సేవలు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల అభివృద్ధి, మహిళల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు.స్మార్ట్‌ఫోన్ల ద్వారా ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయడంలో, డిజిటల్ సేవలు అందించడంలో టీచర్లకు మరింత సౌలభ్యం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి , డీసీసీ అధ్యక్షుడు ధారసింగ్, ఏఎంసి చైర్మన్లు నర్సింలు , అంజయ్య , రజాక్ , మండల తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఐసిడిఎస్ అధికారులు, మండల నాయకులు మరియు అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలి



**నారాయణఖేడ్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** అంగన్‌వాడి కేంద్రాలను పనితీరును మరింత మెరుగుపడాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో "పోషణ పక్షం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం అందజేసిన నూతన మొబైల్ ఫోన్లను ఎమ్మెల్యే గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా "పోషణ పక్షం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచడానికి, ఎప్పటికప్పుడు సమాచారాన్ని డిజిటలైజ్ చేయడానికి ప్రభుత్వం టీచర్లకు స్మార్ట్ ఫోన్లను అందజేసిందని ఆయన పేర్కొన్నారు. అంగన్‌వాడీ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలని అన్నారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. సాంకేతికతను అందిపుచ్చుకుని రికార్డుల నిర్వహణను సులభతరం చేసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, సి డిపివో సుజాత, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, కౌన్సిలర్లు బాణాపురం రాజు, రుక్మిణి గోపాల్ రెడ్డి, షారుఖాన్, మహేష్ చౌహన్, సుబుర్, మైతాబ్,వివేకనంద,లక్ష్మణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహెర్ అలీ, మాజీ ఎంపీటీసీ పండ రెడ్డి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## నరసింహుడి కళ్యాణోత్సవానికి సకల సౌకర్యాలు కల్పిస్తాం



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవానికి సకల ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ లాంఛనాలతో కళ్యాణం జరిపిస్తామని స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని శ్రీ స్వయంభు లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వద్ద జరుగు బ్రహ్మోత్సవాలు కళ్యాణ మహోత్సవం కు సంబంధించి ఆహ్వాన పత్రికను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ భూపతిగళ్ళ మహిపాల్,మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి మున్సిపల్ అధ్యక్షులు ఆకుల ఆనంద్ కుమార్,కౌన్సిలర్స్ దారు రాఘవేందర్ రావు,రాందాస్ నాయక్,స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ భక్తబృందంతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి దేవరశెట్టి ప్రవీణ్ కుమార్, ఆలయ క్లార్క్ ఎం. శేఖర్ భక్త బృందం తాళ్లపల్లి కృష్ణ, తమ్మల కృష్ణ,సోప్పరి లక్ష్మణ్, సూరమోని బాబు, శ్రీనివాసచారి,అశోక్ రెడ్డి, ఆర్కే కృష్ణ, శంకర్ గౌడ్ నాయకులు ప్రజాప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



**బోడుప్పల్, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని ఘట్కేసర్ మాజీ జెడ్పిటిసి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి విమర్శించారు.చెంగిచెర్ల బస్సు డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు శంకర్ గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి ,బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు కొత్త రవి గౌడ్,జడిగే రమేష్ యాదవ్ ,కాటం రాజిరెడ్డి ,బందారపు శ్రీధర్ గౌడ్, ఆర్టీసీ జేఏసీ చైర్మన్ నరసింహ, బీఆర్ఎస్ కార్యకర్తలు, ఆర్టీసీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు..ముమ్మాటికి ప్రభుత్వ హత్య



**హయత్‌నగర్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** హయత్ నగర్ మండలంలోని ఆర్టీసీ బస్ డిపో 1, 2 జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో నర్సంపేట డిపోలో ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన హక్కులను అమలు పరచడంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఆత్మహత్య కు పాల్పడి, మరణించిన కోలా శంకర్ గౌడ్ మృతికి నిరసనగా జేఏసీ కన్వీనర్ అమనగంటి వెంకన్న అధ్యక్షతన సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్ర చారి, ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి లు హాజరై, వారి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి అనేక దఫాలుగా వినతి పత్రాలు ఇచ్చిన స్పందించకపోవడంతో పూర్తిస్థాయి సమ్మెను నిర్వహిస్తూ, ఆత్మహత్యకు పాల్పడిన కోలా శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాల ఆదుకోవాలని, వాళ్ళ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోల శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు, ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని వారు ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను అంగీకరించాలని, రాజ్యాంగం కల్పించినటువంటి కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలపైన ప్రశ్నించే యూనియన్లను రద్దు చేయడం సిగ్గుచేటు, కాబట్టి యూనియన్లను యధావిధిగా కొనసాగించాలని, ఆర్టీసీ ఎంప్లాయిస్‌కి రావాల్సిన రెండు పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్పొరేషన్ రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, లేనియెడల ఉధృతమైన పోరాటాలకు సిపిఐ పార్టీగా మద్దతిస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పి కృష్ణయ్య, మహిపాల్, నరేష్, సోమేశ్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షుడు చెంది వెంకట్, బి వెంకటేష్, 200 మంది కార్మిక శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25 ఏప్రిల్ 2026

# అభివృద్ధికి అవరోధంగా ఉన్న చెత్తను ఏరివేస్తాం

- రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి



**గోదావరిఖని, జనంసాక్షి :**
నగర అభివృద్ధికి అవరోధంగా పరిణమించిన చెత్త నంతా ఏరివేస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా శుక్రవారశీ 36 వ డివిజన్ గాంధీ నగర్ లో స్థానిక కార్పోరేటర్ కల్వల పద్మావతి తో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడు తూ నగరాన్ని నవ నిర్మాణం చేయాలనే సంకల్పంతో ఎంఎల్ఎ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఇచ్చిన పిలుపునందుకొని చెత్త రహిత రామగుండంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని తమ పాలక వర్గం ఆద్వర్యంలో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నగరాన్ని పూర్తి స్థాయిలో శుభ్ర పర్చేశీతవరకు విశ్రమించలేదని అన్నారు. నగరంలో గత 20 ఏళ్లుగా కాలువల్లో సరిగా పూడిక తొలగించలేని దుస్థితిలో తాము నగర పాలక సంస్థపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడకుండా అందుబాటులో ఉన్న మునిసిపల్ వాహనాలు, మునిసిపల్ సిబ్బందితో పూడిక తీత పనులు చేయిస్తున్నామని అన్నారు. ఇరుకు వీధుల కారణంగా చెత్త సేకరించడానికి ఆటో ట్రాలీ, ప్రాణాంతక పరిస్థితుల్లో అంబులెన్స్ రాకుండా ఉన్నందున ఇంటి ముందు నిర్మించుకున్న గద్దెలను స్థానికులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని అన్నారు. కాలువల ప్రక్కన నివసిస్తున్న వారు చెత్త ను కాలువల్లో పడ వేయకుండా మున్సిపల్ ట్రాలీ లకు ఇవ్వాలని కోరారు. ఎవరైనా చెత్త కాలువలో పడవేస్తే సామాజిక భాధ్యత గా ఫోటో తీసి మునిసిపాలిటీకి పంపించాలని కోరారు. ఖాళీ స్థలాల్లో కూడా చెత్త వేయవద్దని వాటిని అందరికీ ఉపయోగపడేలా నగర పాలక సంస్థ అభివృద్ధి చేస్తుందని అన్నారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయడానికి వీలుగా కాలువలపై ఆక్రమణలు లేకుండా చూసుకోవాలని అన్నారు. చెత్త జమయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రజలకు అవగాహన కలిగేలా అక్కడ బోర్డులు ప్రదర్శించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు రంజిత్, మారెల్లి రాజిరెడ్డి, గడ్డం శ్రీనివాస్, విజయ్ తదితరులతో పాటు నగర పాలక పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎస్ఇ గురువీర, ఇఇ పివి రామన్, డిఇలు అఫ్తాబ్, జగదీష్, ఎఇలు అన్వేష్, టిపిఎస్ నవీన్, సానిటరి ఇన్స్పెక్టర్ సంపత్, జవాన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను పట్టించుకోక పోవడం వల్లే ఆత్మహత్యలు

- నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో శుక్రవారం రోజు ఆర్టీసీ జేఏసి కార్మికుల కు మద్దతు తెలుపారు. ఆర్టీసీ డిపో వద్ద కార్మికులతో కలిసి ఆంధోళన పాల్గొని నిరసన తెలిపి, కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు బస్టాండ్ నుండి కార్మికులతో కలిసి అమరవీరుల స్థూపం వరకు మేయర్ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆర్టీసిని ప్రభుత్వం లో విలీనం చేస్తూ, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి కార్మికుల బకాయి ఉన్న వేతన సవరణలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను పట్టించుకొక పోవడం వల్లే ఆత్మహత్యలు చేస్కోవల్సిన పరిస్తితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు చేస్తున్న న్యాయపోరాటానికి బీజేపి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్లే నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందడం జరిగిందని దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. 30 శాతం ఫిట్ మెంట్ తగ్గకుండా 2021 వేతన సవరణలను వెంటనే చేపట్టి ఆర్టీసీ జేఏసి కార్మికులు తీస్కున్న సమ్మెను విరమింప చేయాలన్నారు. ఆర్టీసీ జేఏసి ప్రభుత్వం ముందు ఉంచిన 32 న్యాయమైన డిమాండ్లపై కార్మిక సంఘాలతో సానుకూలంగా చర్చలు జరిపి వాటిని నెరవేర్చే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసి సంస్థలో నూతన రిక్రూట్ మెంట్ చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసే వారికి మద్దతు తెలిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీస్కోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ మొండి వైఖరిని వీడి సమ్మెలో ఉన్న 39 వేల మంది కార్మికులతో తక్షణమే చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా చర్చలు జరపకుండా, సమస్యలను పరిష్కరించ కుండా కార్మికులను బెదింపులకు గురి చేయడం మూర్ఖత్వమని మండి పడ్డారు. ఇప్పటికైన చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాల ని, సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీస్కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు చంద్ర, దేవసాని సరస్వతి, మాసం గణేష్, తోట అనిల్, ఆర్టీసీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ లక్షలను పూర్తి చేయాలి కలెక్టర్ సత్యప్రసాద్

**కథలాపూర్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :**
కథలాపూర్ మండలంలోని మహిళా శక్తి భవనంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైనా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ 13 లక్షల పని దినాలు ఏర్పాటు చేసుకున్నాము ఇప్పటివరకు 6 లక్షల పని దినాలు పూర్తి కావడంతో మిగిలిన పని దినాలను వేగవంతంగా చేసుకోవాలని పనులు జరగకపోవడం వలన కథలాపూర్ బొమ్మన కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దూరం ఉన్న ప్రదేశాలలో కూలీలను ట్రాక్టర్లపై తీసుకెళ్లాలని సూచించారు గ్రామంలో ప్రతిరోజు 200 మంది కూలీలను వచ్చేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు రెండు రోజుల్లో ప్రగతి కనిపించాలని లేకపోతే కఠిన చర్యలు అధికారులపై తీసుకుంటామని హెచ్చరించిన కలెక్టర్. కూలీలకు తాగునీటి వసతులు మజ్జిగ ప్యాకెట్లు నీడ కోసం పత్రాలు ఏర్పాటు చేయాలని అవసరమైతే ప్రథమ చికిత్స కూడా అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

# పలు సమస్యలపై మంత్రులకు వినతి



**ఆర్మూర్,ఏప్రిల్ 24 (జనంసాక్షి):** ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్, నందిపేట్ మండలాల సమస్యలను మెడికల్, వెల్ఫేర్ సైన్స్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహ,ట్రైబల్ వెల్ఫేర్,మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ని ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి పొద్దుటూరు వినయ్ రెడ్డి, సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి శుక్రవారం వినతి పత్రం అందించారు.పట్టణంలో 100 పడకల ఆసుపత్రికి సిబ్బంది కొరత ఉన్నందున పూర్తిస్థాయి డాక్టర్లని, ఇతర సిబ్బందిని నియమించాలని,నందిపేట మండల కేంద్రంలో పీహెచ్సీ సెంటర్లో డాక్టర్లు సిబ్బంది 24/7 అందుబాటులో ఉండేటట్లు 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, మాయాపూర్ గ్రామ పిహెచ్సి సెంటర్‌కు పూర్తిస్థాయి సిబ్బందిని, ప్రహరీ గోడ నిర్మాణానికి 30 లక్షలు మంజూరు చేయాల్సిందిగా మంత్రి దామోదర రాజనర్సింహకు సమస్యను విన్నవించగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నందిపేట్ మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్ కాంపౌండ్ వాల్ మంజూరు చేయాలని,ఐలాపూర్ గ్రామానికి ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు హాస్టల్ మంజూరు చేయాలని, ఆర్మూర్ పట్టణంలో కోటి రూపాయలతో నాలెడ్జ్ హబ్ సెంటర్ ఐదు మండలాలకి ఒక్కో మండలంలో నాలెడ్జ్ హబ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని మంత్రి అట్లూరి లక్ష్మణ్‌కి వినతితో తెలిపారు. సానుకూలంగా స్పందించి తప్పకుండా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందిపేట్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు సిలిందర్ లింగం,నందిపేట్ మండల గ్రామాల సర్పంచులు లక్ష్మీనారాయణ, శ్రీకాంత్,సాయి కుమార్,దేవేందర్,దేవదాసు, ముత్యం, నవీన్, మహమూద్, హనుమాన్, సుదన్, జీవన్ పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం





**వికలాంగులకు స్కూటీల పంపిణీ చేసిన మధుయాష్కి గౌడ్**

**హయత్ నగర్, ఏప్రిల్ 24 (జనం సాక్షి) :**
తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని రాధా మానసిక వికలాంగుల సంస్థలోఏర్పాటు చేసిన దివ్యాంగులకు వాహనాల (త్రిచక్ర స్కూటీలు) పంపిణీ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి లతో కలిసి హాజరై, ఎల్బీనగర్ నియోజకవర్గం లోని పలువురు లబ్ధిదారులకు వాహనాలను, దివ్యాంగులకు హెల్మెట్లను, శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి ఫోన్ లను అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని, అందులో భాగంగా వికలాంగులకు వాహనాలను అందజేసిందని పేర్కొన్నారు. స్వయం ఉపాధి లో భాగంగా మైనారిటీలకు కుట్టుమిషన్లు, ఈ - స్కూటర్లను ప్రభుత్వం అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంను సమాంతరంగా కొనసాగిస్తున్నదన్నారు. ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం పంపిణీ, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు తదితర పేదల సంక్షేమం కోసం పథకాలను తీసుకువచ్చి అమలు చేస్తుందని వివరించారు.
ఈ సందర్భంగా దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మానసిక వికలాంగులైన విద్యార్థులు, లబ్ధిదారులకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు పాత వాహనాలను ఆధునిక మోటార్ సదుపాయాల తో మార్చి అందజేశారు. ఈ పథకం ద్వారా వారి రోజువారీ జీవితం మరింత సులభతరం అవుతుందని వారు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని పలు కార్యక్రమాలు అమలు చేయాలనీ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సదుపాయాలు అందేలా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ రేణుక, డిడిఆర్ సి రమేష్, మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్ గౌడ్, రాగుల వెంకటేశ్వర రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్, సురేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, చెన్న గోని రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు , పన్యాల జయపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, దేవాలయ కమిటీల డైరెక్టర్లు భవాని శంకర్, దిండు ప్రవీణ్ గౌడ్, భీమిడి రామకృష్ణ రెడ్డి, కృపాకర్ రెడ్డి, గణేష్ రెడ్డి, బొగ్గరాపు శరత్, చెరుకు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# పిసి ఘోష్ కమిషన్ రాజ్యాంగబద్ధంగానే వేశారు

**నివేదికను హైకోర్టు తప్పు పట్టలేదు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**సిరిసిల్ల టౌన్ ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** కాళేశ్వరంపై తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి హోదాలో జీవన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవన్ రెడ్డి మాటలు నేతిబీరకాయలో నేతి ఎంతుంటుందో ఆయన మాటలు ఆ విధంగా ఉన్నాయన్నారు. కాళేశ్వరం పైన పిసిగోస్ నివేదికపై ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పిసిగోస్ నివేదిక చెంపపెట్టు లాంటిదని అనడం సరైంది కాదన్నారు. రాష్ట్ర హైకోర్టు పిసిగోస్ కమిషన్ రాజ్యాంగబద్ధంగా వేశారని, చట్టబద్ధతను హైకోర్టు ఎక్కడ తప్పు పట్టలేదని, రాష్ట్ర హైకోర్టు తీర్పు వల్ల సిబిఐ విచారణకు అడ్డంకిగా ఉండటానికి అవకాశం లేదన్నారు. ఆనాడు జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కాళేశ్వరంలో అడ్డగోలుగా తప్పులు జరిగాయని కూలిపోయిన సందర్భంలో దుమ్మెత్తి పోసారని ప్రజాసొమ్మునంతా కాళేశ్వరంలో పోశారని, కాంగ్రెస్ పార్టీ పక్షాన విమర్శించారని గుర్తు చేశారు. ఇప్పుడు మాట మార్చుడం ఎంతవరకు సబబమని అన్నారు. పిసి గోస్ కమిషన్ ఇచ్చిన నివేదికను తప్పు పట్టలేదని హైకోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిగా చదవాలని సూచించారు. ఎన్ డి ఏ సి అధికారులు చెప్పిన విధంగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడతామన్నారు. రానున్న రోజుల్లో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.



# కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె

**వేములవాడ డిపో ముందు సొమ్మసిల్లి పడిపోయిన మహిళ కండక్టర్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**
తమ న్యాయమైన డిమాండ్ లు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. శుక్రవారం వేములవాడ ఆర్టీసీ డిపో ముందు కార్మికులు డిపో నుండి బస్సులు బయటకు వెళ్లకుండా డిపో ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా కండక్టర్ రమా స్పృహ తప్పి సొమ్మసిల్లి పడిపోయింది. అప్రమత్తమైన ఆర్టీసీ కార్మికులు పోలీస్ సిబ్బంది రమను వెంటనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్య సిబ్బంది పరీక్షించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా వేములవాడ ఆర్టీసీ జేఏసీ అధ్యక్షుడు జిపి సింగ్, జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన 32 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ మొండి వైఖరితో పలువురు కార్మికులు మనోధైర్యం కోల్పోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించక పోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు.

# తల్లి-కూతురు కలిసి నివాళి.. శంకర్ గౌడ్‌కు శ్రద్ధాంజలి





- కరీంనగర్‌లో ఆర్టీసీ సిబ్బంది భారీ ర్యాలీ.. కొవ్వొత్తుల నివాళి
- కార్మిక సమస్యలపై ప్రభుత్వానికి విజ్ఞప్తి

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 24 జనం సాక్షి:** నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి కరీంనగర్ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆర్టీసీ సిబ్బంది కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి గౌరవ నివాళులు అర్పించారు. కరీంనగర్ డిపో 1, 2ల నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్టాండ్ సర్కిల్ వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో ఆర్టీసీ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని శంకర్ గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమం మొత్తం భావోద్వేగ వాతావరణంలో సాగింది. సమ్మెలో భాగంగా సిబ్బంది కుటుంబ సభ్యులు కూడా పాల్గొనడం విశేషం. ముఖ్యంగా తల్లి, కూతురు కలిసి నిరసనలో పాల్గొని శంకర్ గౌడ్‌కు నివాళులర్పించడం అక్కడి వారిని భావోద్వేగానికి గురిచేసింది. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు సిఐలు రామకృష్ణ, తిరుమల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ఆవునూర్ అమ్మాయి ప్రభంజనం

**ముస్తాబాద్ (జనంసాక్షి) :** ఇంటర్మీడియట్ రెండో సంవత్సర ఫలితాల్లో ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన అతికం హారిక ప్రభంజనం సృష్టించింది. గీత కార్మిక కుటుంబానికి చెందిన హారిక రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది. ఎంపీసీలో ప్రతిభ చూపిన ఈ అమ్మాయి 995/1000 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకర్ గా నిలిచింది. ఈరోజు గ్రామ పంచాయతీలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం, సందర్భంగా విద్యార్థినికి ఆమె తల్లిదండ్రులకు గ్రామ సర్పంచ్ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మొహమ్మద్ వాజీద్, ఏపీఓ ఆనంద్, సెక్రెటరీ, వార్డ్ సభ్యులు, వివోలు పాల్గొన్నారు.

# తెలంగాణలో మావోయిస్టు పార్టీ అధ్యాయం ముగిసింది





- రాష్ట్రంలో కొత్త పోలీస్ విధానం రాబోతుంది : డిజిపి శివధర్ రెడ్డి
- రుద్రంగిలో పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డిజిపి
- వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేస్తామని వెల్లడి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/ రుద్రంగి ఏప్రిల్ 24 (జనంసాక్షి) :**
తెలంగాణలో మావోయిస్టు పార్టీ అధ్యయనం ముగిసిందని,రాష్ట్రంలో కొత్త పోలీస్ విధానం రాబోతుందని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్‌తో కలిసి శుక్రవారం డిజిపి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ఇప్పటినుండి రాష్ట్రంలో ఏకే 47 అవసరం ఉండదన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే రౌడీల కు గుండాలకు కాదని,ఇది సామాన్యులకేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సైబర్ క్రైమ్ గంజాయి వంటి నివారణకై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.తాను 1995లో కరీంనగర్లో ట్రైనింగ్ లో ఉన్న సమయంలో ఈ ప్రాంతానికి వచ్చానని, ఆనాడు ఈ ప్రాంతం నక్సల్స్ ప్రాబల్యంతో నిండి ఉండేదనీ చెప్పారు. ప్రస్తుతం చాలా మార్పు వచ్చిందన్నారు. తాను హైదరాబాద్ నుండి వచ్చేటప్పుడు చూసుకుంటూ వస్తే రోడ్డుపై చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోలేదన్నారు. అనేక మరణాలు రోడ్డు ప్రమాదల వల్లనే జరుగుతున్నాయని ప్రమాదాల నివారణకు వాహనదారులు అందరూ సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కుటుంబం ముఖ్యమనే విషయాన్ని గుర్తించుకోవాలని కోరారు. వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తో పాటు,రాజన్న భక్తుల సౌకర్యార్థం మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు డీజీపీ తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ 2.50కోట్లతో పోలీస్ స్టేషన్ నిర్మాణం జరుగుతుందన్నారు.చట్టాన్ని సంరక్షించేందుకు పోలీస్ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో నిరంతరాయంగా పోలీసులు పనిచేస్తూ,శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి .గీతే,అదనపు ఎస్పీచంద్రయ్య, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీవో రాధాబాయి,చందుర్తి, వేములవాడ సిఐలు వెంకటేశ్వర్లు వీరప్రసాద్, శ్రీనివాస్,రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ మోహన్ రెడ్డి, రుద్రంగి గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ,మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**భీమన్నను దర్శించుకున్న డిజిపి..**
రుద్రంగిలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పూజలో పాల్గొన్న అనంతరం వేములవాడకు చేరుకుని శ్రీ భీమేశ్వర స్వామి దర్శించుకున్నారు. ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు వేదొక్త ఆశీర్వచనం నిర్వహించగా ఆలయ డీఈవో భాస్కర్ స్వామివారి శేష వస్త్రాలు,చిత్రపటం,ప్రసాదాల్ని అందజేశారు.ఆయన వెంట జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ మహేష్ భగవతే.బి.గితే,ఆర్డిఓ రాధాబాయి,అదనపు ఏఎస్పి చంద్రయ్య, డీఎస్పీ శ్రీనివాసులు, తహసిల్దార్ జయంత్ కుమార్, వేములవాడ పట్టణ,రూరల్ సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలకు సరిపడా సమృద్ధిగా తాగునీటి సరఫరా

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థల పరిశీలన జరిపిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 24 జనం సాక్షి:**
జిల్లాలోని ప్రతి నివాస ప్రాంతంలో ప్రజల అవసరాలకు సరిపడా సమృద్ధిగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి. అధికారులకు సూచించారు. ప్రస్తుత వేసవిలో ఎక్కడ కూడా దాహార్తి సమస్య తలెత్తకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అన్నారు. బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బోధన్ బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏ.ఈలు, ఎంపీఓలు ఇతర అధికారులతో కలెక్టర్ మంచినీటి సరఫరా స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు.
వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. రానున్న రెండు మూడు నెలలు ఎంతో కీలకమైనందున, నీటి సరఫరా విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. ఏ మారుమూల నివాస ప్రాంతాలకు సైతం రక్షిత మంచి నీటిని అందించేందుకు వీలుగా ఎడపల్లి మండలం జానకంపేట వద్ద ఏర్పాటు చేసిన తరహాలోనే అనంతగిరి, నెహ్రూనగర్ గ్రామాలకు సైతం సమృద్ధిగా తాగునీటి సరఫరా కోసం ఆన్లైన్ బూస్టర్ సిస్టమ్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా, మంచినీటి సరఫరా వ్యవస్థకు ఎక్కడ కూడా అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పైప్ లైన్లు, వాల్వ్ లకు నష్టం కలిగేలా వ్యవహరించే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, మిషన్ భగీరథ ఈ.ఈలు రాకేష్, స్వప్న, డీఎల్పీఓలు శ్రీనివాస్, నాగరాజు, ఆయా మండలాల ఎంపీడీఓలు, ఏ.ఈలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

**శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**
అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయం కోసం బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ ప్రాంతంలో ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ళ నిర్మాణానికి ఈ స్థలాన్ని ఖరారు చేసినందున, శంకుస్థాపన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే పనులు ప్రారంభించి, నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇందులో భాగంగానే మంజూరీ తెలుపబడిన బోధన్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీ.ఈ రాందాస్, తహసీల్దార్ విఠల్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# ఆస్పత్రిలో మృతదేహంపై ఆభరణాలు చోరీ




**జగిత్యాల, ఏప్రిల్24 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ విభాగంలో దారుణం చోటుచేసుకుంది. గురువారం తెల్లవారు జామున అనారోగ్యంతో ఏల్పుల బాలవ్వ(80) అనే వృద్ధురాలు మృతిచెందగా ఆమె చెవులకు ఉన్న ఆభరణాలు మాయమయ్యాయి. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన ఏల్పుల బాలవ్వ అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలవ్వ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు మృతదేహాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకో వాలని బంధవులకు సూచించాడు. దీంతో బంధువులు బాలవ్వ మృతికి సంబంధించిన సర్టిఫికెట్లను ఆసుపత్రి సిబ్బంది నుంచి తీసు కొని మృతదేహాన్ని అంబులెన్స్‌లో వారి స్వ గ్రామానికి తరలించారు. ఇంటికి వెళ్లిన తర్వాత చూడగా బాలవ్వ చెవులకు ఉన్న కమ్మలు కనిపించక పోవడంతో వెంటనే ఆమె అల్లుడు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సెక్యూరిటీ గార్డును నిలదీశాడు. అతను తనకు సంబంధం లేదని చెప్పాడు. దీంతో బాలవ్వ అల్లుడు శంకర్ జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



# 'ఎస్ఎల్‌బీసీ' త్వరగా పూర్తి చేయాలి

**సొరంగం మార్గం తవ్వకాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సమీక్ష**

- కాళేశ్వరం మరమ్మతులలోనూ భాగస్వామ్యం కావాలి
- ఎన్‌జిఆర్ఐ సంస్థకు సూచించిన మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం తవ్వకాలలో అనుకరించాల్సిన భద్రతా ఏర్పాట్లపై నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సమగ్రంగా రూపొందించిన నివేదికను శుక్రవారం రోజున డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎన్‌జిఆర్ఐ ప్రధాన శాస్త్ర వేత్త సత్యనారాయణ అందించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్.జి.ఆర్.ఐ సంస్థను అభినందించడంతో పాటు ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ పనుల పురోగతితో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో బాగమైన మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌ల పునరుద్ధరణకు గాను ఎన్‌జిఆం.ఐ ఆధ్వర్యంలో భూపరిశోధన( సాయిలు టెస్ట్) భాగస్వామ్యం కావాలన్నారు. శుక్రవారం రోజు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఈ మేరకు సవిక్షా సమావేశం నిర్వహించారు.ఇ ఎన్ సి రమేష్ బాబు సొరంగ మార్గం తవ్వకాల నిపుణుడు పరిక్షిత్ మెహ్రా, ఎన్‌జిఆర్ఐ శాస్త్రవేత్త సత్యనారాయణ తదితరు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగాఎన్.జి.ఆర్.ఐ రూపొందించిన నివేదిక పై అయన మాట్లాడుతూ ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకాల సమయంలో జరిగిన దురదృష్టకర సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకే తవ్వకాల సమయంలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలపై ఎన్.జి.ఆర్.ఐ తో సమగ్రంగా సర్వే నిర్వహినట్లు ఆయన తెలిపారు.తవ్వకాల సమయంలో ముందస్తుగా ప్రమాదవకాశాలను గుర్తించేందుకు వీలుగా ఈ సంస్థ సీస్మిక్ ఇమేజింగ్,ఎలక్ట్రికల్ రెసిస్టివిటి టొమోగ్రఫీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు ఆయన వివరించారు. సొరంగ మార్గం తవ్వకాలలో కార్మికుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం మొదట ప్రాధాన్యతాంశంగా పెట్టుకుందన్నారు. అందుకు తగినట్లు గానే ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తల మార్గదర్శనానికి అనుగుణంగానే సొరంగ మార్గం తవ్వకాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఎన్.జి.ఆర్.ఐ రూపొందించిన నివేదిక లో స్ట్రైన్ జోన్ లు,నీటి ఊరట లతో పాటు సొరంగమార్గం పై భాగం తదితర అంశాల పై ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తలు సమగ్రంగా అధ్యయనం జరిపారని ఆయన తెలిపారు.ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ పనుల పై ఆయన మాట్లాడుతూ వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఎలక్ట్రిక్ లోడర్లు,భారీ డంపర్ల తోడ్పాటుతో ఇప్పటి వరకు 151.50 విటర్ల తవ్వకం పూర్తి అయిందన్నారు. దేశీయ,అంతర్జాతీయంగా సంస్థల నుండి ఆధునిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాంగాన్ని సవికరించి రెండు వైపులా నెలకు 200 విటర్ల వరకు తవ్వకాలు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే!

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం తన మనసును తీవ్రంగా కలిచివేసిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. శంకర్ గౌడ్ మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాంనగర్, అచ్చయ్య నగర్ ప్రాంతాల్లో స్థానిక ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రాంనగర్, చిప్పెండేల్ అపార్ట్‌మెంట్ వాసులతో భేటీ అయి, స్థానిక సమస్యలు మరియు అభివృద్ధి పనులపై చర్చించారు. తర్వాత అపార్ట్‌మెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె బాట పట్టారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్లే తాము మోసపోయామనే ఆవేదన కార్మికుల్లో గూడుకట్టుకుందని తెలిపారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, కార్మికులను మరింత ఆందోళనకు గురిచేసి ప్రాణాలు తీసుకునే పరిస్థితికి నెట్టడం దుర్మార్గమని, ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి, కార్మిక సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని సూచించారు.

'ఏ సమస్యకూ ఆత్మహత్య పరిష్కారం కాదు. మీ కుటుంబాలను రోడ్డున పడేసే ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని ప్రతి ఒక్క కార్మికుడికి నేను చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నాను. మీ హక్కుల కోసం చేసే పోరాటంలో మేము మీకు అండగా ఉంటాం. ప్రాణాలు తీసుకోవడం వల్ల మీ కుటుంబం కుప్పకూలిపోవడమే కాకుండా, ఉద్యమం కూడా బలహీనపడుతుంది. దయచేసి ఎవరూ ధైర్యం కోల్పోవద్దు." అని ఆర్టీసీ కార్మికులకు సూచించారు. మిర్యాలగూడలో ఆత్మహత్యా యత్నం చేసిన మరో డ్రైవర్ రావుల వెంకన్నకు ప్రభుత్వం తక్షణమే అత్యుత్తమ వైద్య సదుపాయాలు కల్పించాలని, శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం తగిన భరోసా కల్పించి, ఆదుకోవాలని కోరారు. ప్రజారవాణా స్తంభించి సామాన్యులు ఇబ్బంది పడుతున్న తరుణంలో, ప్రభుత్వం పంతాలకు పోకుండా మానవీయ కోణంలో ఆలోచించి సమ్మెను విరమింపజేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

# చిన్నారికి 'సీఎం ప్రజావాణి' భరోసా

**సంకటంగా మారిన పేరెంట్స్ బర్త్ సర్టిఫికెట్ లోపాలు**

- ఆధార్ కార్డు లభించక ఉన్నత చదువులకు అడ్డంకి
- 'సీఎం ప్రజావాణి' లో దరఖాస్తు చేసుకున్న చిన్నారి
- ఆధార్ కార్డు మంజూరుకు చిన్నారెడ్డి భరోసా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తల్లిదండ్రుల బర్త్ సర్టిఫికెట్ లో ఉన్న లోపాల కారణంగా చిన్నారి సాయి కృపకు ఆధార్ కార్డు జారీకి సంకటంగా మారింది. ఉన్నత చదువులు, హాస్టల్లో అడ్మిషన్ కు, బ్యాంకు సహా ఇతర అవసరాలకు ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో చిన్నారి సాయి కృప భవితవ్యం ఆధార్ కార్డు లేకపోవడంతో ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఆ చిన్నారి ఆధార్ కార్డు కోసం శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజావాణిని ఆశ్రయించింది. చిన్నారి సాయి కృప పరిస్థితిని అర్థం చేసుకున్న సీఎం ప్రజావాణి ఇన్చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి చిన్నారి తల్లిదండ్రుల బర్త్ సర్టిఫికెట్ లో ఉన్న లోపాలను సరిదిద్ది ఆధార్ కార్డు మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. చిన్నారి సా యి కృప తల్లిదండ్రులు లాజర్, వినోద బర్త్ సర్టిఫికెట్ లో ఇంటిపేరు ' ఎస్ ' అని నమోదు కాగా 'ఎం' అని మార్చితే తప్ప చిన్నారికి ఆధార్ కార్డు లభించదు. చిన్నారి సాయి కృప కర్మన్ ఘాట్ ప్రాంతంలోని నందనవనం ప్రభుత్వ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతోంది. చిన్నారి తల్లిదండ్రులు భవన నిర్మాణ కార్మికులు. చిన్నారి భవితవ్యం ఆధార్ కార్డుతో ముడిపడి ఉంది.

**సీఎం ప్రజావాణిలో 248 దరఖాస్తులు**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 216వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 248 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 79, రెవెన్యూ శాఖకు సంబంధించి 31, ఇందిరమ్మ ఇండ్ల కోసం 78 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 60 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

**10 థీమ్ లపై శాఖల వారీగా కార్యక్రమాలు**

**డ్రగ్స్ అడ్డుకట్టకు పిల్లలు, యువతలో చైతన్యం**

**హైదరాబాద్, ఏప్రిల్24 (జనంసాక్షి) :** ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా 10 థీమ్ లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, థీమ్ ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ఇప్పటివరకు పరిశుభ్రత-ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, ఆరైవ్- ఆలైవ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ నెల 26 వరకు సంక్షేమం పై కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 27 నుండి మే నెల 2 వ తేదీ వరకు పిల్లల భద్రత లో భాగంగా డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయుటకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. మే 4 నుంచి 10 వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అభివృద్ధికి విద్య దిక్సూచిగా నిలుస్తుందనే సంకల్పంతో మే నెల 11 నుంచి 16 వరకు విద్య యొక్క ప్రాధాన్యత, ప్రామాణిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పై విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషిస్తుంది. అందులో భాగంగా క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో స్పష్టం చేసేందుకు మే 18 నుంచి 23 వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మే 25 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయుటకు చేపట్టిన పథకాలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణం థీమ్ పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని , అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచుటకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమనీ ను ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

# రాహుల్ మీనాకు నాలుగు రోజుల పోలీస్ కస్టడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లో అత్యాచారం, హత్యాచారం కేసుల్లో అరెస్టు చేసిన నిందితుడు రాహుల్ మీనాకు నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీ విధించింది న్యాయస్థానం. ఇద్దరిపై అత్యాచారం చేసి అందులో ఒకరిని హత్య చేసిన కేసుల్లో అతన్ని పోలీసులు గురువారం నాడు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అతని స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు. ఆ సమయంలో పోలీసులకు చుక్కలు చూపించాడు నిందితుడు రాహుల్. విచారణ సమయంలో నిందితుడు తన స్టేట్మెంట్‌ను పలుమార్లు మార్చి చెప్పినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. అనంతరం నాలుగు రోజుల కస్టడీ కోరుతూ ఢిల్లీ పోలీసులు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ సందర్భంగా 'నా వల్ల నేరం జరిగింది.. తప్పు జరిగిపోయింది' అంటూ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దీపికా థాకరన్ ఎదుట రాహుల్ మీనా నేరం ఒప్పుకున్నాడు. విచారణ అనంతరం నిందితుడిని నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. రాజస్థాన్‌లోని అల్వార్‌లో మంగళవారం రాత్రి తన స్నేహితుడి భార్యపై నిందితుడు రాహుల్ మీనా అత్యాచారం చేశాడు. ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఓ వ్యాన్‌ను రూ.6 వేల కిరాయికి మాట్లాడుకుని ఢిల్లీకి బయలుదేరాడు. అక్కడికి చేరిన తర్వాత నగదు చెల్లించకుండానే పారిపోయాడు. గతంలో కైలాష్ హిల్స్ ప్రాంతంలో తాను పని చేసిన ఇంటి వద్దకు చేరుకున్నాడు. యజమాని, అతని భార్య జిమ్‌కి వెళ్లడంతో ఉదయం 6:30 గంటలకు ఇంట్లోకి ప్రవేశించాడు. ఒంటరిగా ఉన్న యజమాని కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మొబైల్ ఛార్జర్ వైర్‌తో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం విలువైన వస్తువులు దోచుకుని పరారయ్యాడు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గతంలో అక్కడ పని చేసిన సమయంలో నగదు విషయంలో అవకతవకలకు పాల్పడడంతో అతన్ని పని నుంచి తీసేశారు యజమాని. దాన్ని మనసులో పెట్టుకుని ఈ దారుణానికి ఒడికట్టాడు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరిపై అత్యాచారం చేసి అందులో ఒకరిని హత్య చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కస్టడీలో నిందితుడు ఇంకా ఎలాంటి విషయాలు వెల్లడిస్తాడో వేచి చూడాల్సిందే.

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

**బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది**

- ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ



**కోల్‌కతా, ఏప్రిల్24 (జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ రోజు ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హావ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

# నాందెండ్లకు కేటీఆర్ నివాళి



**హైదరాబాద్, ఏప్రిల్24 (జనంసాక్షి) :** ఇటీవల మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లి ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చరు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ రాజు శంభీపూర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నాదెండ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. నాదెండ్ల మనోహర్‌ను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆకర్షణలేని ట్రంప్ గోల్డ్ కార్డు పథకం

**వాషింగ్టన్, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** అమెరికాలో శాశ్వత నివాసం కోరుకునే విదేశీయుల కోసం గతేడాది డిసెంబర్‌లో ట్రంప్ ప్రభుత్వం గోల్డ్ కార్డు స్కీమ్‌ను ప్రారంభించింది. కొత్త స్కీమ్ అమల్లోకి వచ్చి నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకూ కేవలం ఒక్కరికే గోల్డ్ కార్డు దక్కింది. ఈ విషయాన్ని అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హొవార్డ్ లుట్నిక్ పేర్కొన్నారు. అమెరికా కాంగ్రెస్ (చట్టసభలు) కమిటీకి ఈ వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. గోల్డ్ కార్డు కావాలనుకునే విదేశీయులు 1 మిలియన్ డాలర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు అదనం. అయితే, ఈ స్కీమ్‌కు డిమాండ్ అద్భుతంగా ఉందని మొదట్లో లుట్నిక్ చెప్పుకొచ్చారు. ఏకంగా 1.3 బిలియన్ డాలర్ల విలువైన వాటిని జారీ చేశామని అప్పట్లో అన్నారు. ఇందుకు భిన్నంగా ఆయన కేవలం ఒక్క గోల్డ్ కార్డును మాత్రమే జారీ చేశామని తాజాగా పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, వందల సంఖ్యలో గోల్డ్ కార్డు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని లుట్నిక్ కాంగ్రెస్ కమిటీకి చెప్పారు. వీసా కోసం జనాలు క్యూకట్టారని కూడా లుట్నిక్ అన్నారు. అధికారులు ఈ మధ్యనే పూర్తి స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని కూడా చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఎంపికైన వారికి కేవలం ఐదేళ్లల్లోనే పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది.

# రఘునాథపల్లి స్టేషన్ వద్ద పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధర్నా

**జనగామ, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లాలోని నర్సంపేటకు వెళుతున్న మాజీ హోంమంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోతు కవితను జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ గేట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. నర్సంపేట డిపో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడంతో విషయం తెలుసుకున్న వారు నర్సంపేటకు వెళుతున్న క్రమంలో రఘునాథపల్లి పోలీసులు వారిని అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న జనగామ శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి వెంటనే రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌కు కార్యకర్తలతో చేరుకొని, స్టేషన్ ఎదురుగా బైఠాయించారు. బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, వారి మరణానికి కారణమైందని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి వారి అపాయింట్మెంట్ డేటును ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370